honeybee.org

Vol-5 Issue-5

సంపుటి 5 సంచిక 5 జులై-ఆగస్టు 2017

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక







# శాంతి సారాంశం



ఒకరోజు ఒక రాజుగారు "ఏ చిత్రకారుడైతే శాంతం ప్రతిబింబించేలా ఉత్తమమైన చిత్రం గీస్తాడో అతడికి బహుమతి ఇస్తాను" అని ప్రకటించాడు. చాలామంది చిత్రాలు గీశారు. రాజుగారు వాటన్నిటినీ చూసి రెండింటిని ఎంపిక చేశారు. ఆ రెండూ అతనికి బాగా నచ్చాయి. వాటిలో ఒకదాన్ని ఉత్తమమైన దానిగా ఎంపిక చేయాల్సి వుంది. ఒక చిత్రంలో నిశ్శబ్దంగా వున్న కొలను, చుట్టూ కొండలతో ప్రశాంతత, కొలనుపై నీలాకాశం, దాన్నో అక్కడక్కడా దూది పిందెల్లాంటి తెల్లని మబ్బులు ఉన్నాయి. ఆ చిత్రాన్ని చూసిన వారంతా "శాంతిని ఆ చిత్రం చక్కగా ప్రతిబింబిస్తోంది" అన్నారు.

రెండో చిత్రంలో కూడా కొండలు ఉన్నాయి కానీ, అవి బోసిగా, ఎగుడు దిగుడుగా ఉన్నాయి. పైన ఆకాశం కోపంగా ఉంది. దానిలో మెరుపులతో బోరున వర్షం కురుస్తోంది. కొండకు ఒకపక్క నురగలు కక్కుతున్న జలపాతం ఉంది. ఇవేవీ ప్రశాంతతని ప్రతిబింబించేట్టు లేవు.

కానీ రాజు నిశితంగా పరీక్షిస్తూ వుంటే జలపాతం వెనక కొండల్లోని రాళ్ళ మధ్యలోనున్న పగుళ్ళలోంచి ఒక చిన్న చెట్టు మొలిచింది. దానిపైన తల్లిపక్షి గూడు కట్టుకొని వుంది. సుళ్ళు తిరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న నీళ్ళ మధ్య తల్లిపక్షి తన గూట్లో కూర్చుని ఆకాశం వంక చూస్తోంది ప్రశాంతంగా....

ఏ చిత్రానికి బహుమతి వచ్చిందనుకుంటున్నారు?

– హనీబీ 14(3) – 2003

Vol-5, Issue - 5 PALLE SRUJANA July-August 2017

ఈ సంచికలో...

# పల్లెసృజన

సంపుటి-5 సంచిక - 5
జులై-ఆగస్టు 2017

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org, Visit at :www.pallesrujana.org

సంపాదకవర్గం
ప్రధాన సంపాదకులు : **బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్,** సంపాదకులు : **జమ్మలమడక శశిమోహన్,** ఉప సంపాదకులు : **పల్లె వీర రాఘవ రెడ్డి**
సలహాదారులు : **డా. కె.ఎల్. రావు, ప్రొ. అనిల్ గుప్త, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ, జాగర్లమూడి దుర్గాప్రసాద్, శ్రీ జమ్మలమడక శ్రీకర్,** కార్టూన్స్ : **వెంకట్**
డి.టి.పి. & డిజైనింగ్ : **నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.ఫోన్ : 81257 99904, E-mail : narendragrafixhyd@gmail.com

## ఈ సంచికలో...


**3**

రైతుకు మార్గదర్శకాలు అందించే
- **రైతన్నలకు విజయ కుమార్ సూచనలు-సలహాలు**

**6**

అందరికీ అందుబాటు ధరలలో
- **అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు**

**10**

రైతుల ఆదాయం పెంచే
- **బియ్యం పట్టే చిన్నమర (మినీ రైస్‌మిల్)**

**13**

9వ జాతీయ ద్వైవార్షిక పోటీలు
- **బహుమతి పొందిన ఇన్నోవేషన్లు**

**18**

రైతుకు ఆదా చేయటమే పరమావధిగా
- **బాబూరావు సృజనలు**

**20**

వెనిగండ్ల పద్మజ
- **ఒక అమ్మ కథ**

**23**

'పల్లెసృజన' జ్ఞాపకాలతో
- **జీవనయాత్ర ముగించిన ఈశ్వరమ్మ**

**24**

నిర్మల్ జిల్లాలో....
- **23వ చిన్న శోధయాత్ర**

**30**

మెదక్ జిల్లాలో
- **'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన**

**32**
పాఠకుల మనఃస్పందన
- **స్పందన**


**Annual Subscription Rs. 200/-**
**No Retail Sales**

కవర్ లోపలి పేజీల్లో ... **శాంతి సారాంశం** హనీబీ కథ , **అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'**

మధ్య పేజీలో : **రైతులకోసం రైతులు తయారు చేసిన స్ప్రేయర్లు, వ్యవసాయ పరికరాలు**

ప్రతి పేజీలో
**అబ్దుల్ కలాం గారి సూక్తులు**

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

# పన్నెండవ యేట అడుగిడుతున్న 'పల్లెసృజన'

'పల్లెసృజన' పత్రిక ఈ సంచికతో పన్నెండవ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. పాఠకుల సహకారంతో, వాలంటీర్ల కృషితో మీ 'పల్లెసృజన' ఏ అవరోధాలు లేకుండా నిరాటంకంగా ప్రచురితమవుతున్నది. ఈ పత్రికా ప్రచురణ ఒక వినూత్న ప్రయోగం. అద్భుత అనుభవం కూడా. పెట్టుబడి లేకుండా, సిబ్బంది లేకుండా, జీతాలు ఇవ్వకుండా, వ్యాపార ప్రకటనలు లేకుండా, విరాళాలు (స్పాన్సర్‌షిప్) తిరస్కరిస్తూ, రిటైల్ అమ్మకం లేకుండా మీ ముందుకు వస్తోంది. పూర్తిగా అంకితభావంతో స్వచ్ఛందంగా పనిచేసే సంపాదకవర్గంతో విజయవంతంగా జరుగుతున్న అద్భుత ప్రయోగం ఈ 'పల్లెసృజన' ప్రచురణ. "ఆర్థిక స్వాతంత్ర్యం, భావ స్వాతంత్ర్యాన్నిస్తుందన్న" మహాత్మాగాంధీ ఉపదేశాన్ని అక్షరాలా అనుసరిస్తూ, పల్లె జ్ఞానాన్ని పల్లెవాసులకు అందజేయాలన్న ఆకాంక్షతో నడుస్తున్నదే 'పల్లెసృజన'. ఈ ప్రయాణంలో మమ్మల్ని అర్థం చేసుకుని, మా ఉద్దేశ్యాలను ప్రోత్సహిస్తూ, మాకు సదా తోడుగా వున్న సభ్యులకు శిరసు వంచి నమస్కరిస్తున్నాము.

గ్రామాల్లోని ఇన్నోవేటర్లను వెతికి, వెలికి తీయడం ఒక మహత్తరమైన కార్యం. ఈ విధానం క్లాసు రూముల్లో కాని, పుస్తకాల్లో కాని వెతికితే కనిపించేది కాదు. ఎవరినుంచో నేర్చుకుందామంటే ఇలాంటి కార్యక్రమంలో అనుభవం ఉన్నవాళ్ళు దొరకటం మహాకష్టం. వందలకొద్ది పల్లెసృజన స్వచ్ఛంద సేవకుల (వాలంటీర్ల)లో పెద్దలు, విజ్ఞులు, మహిళలు, విద్యార్థులు, యువత, గ్రామీణులు, ఉపాధ్యాయులు, కార్మికులు గ్రామ ప్రజలమీద వున్న అపరిమిత ప్రేమతో స్వచ్ఛందంగా గ్రామాలు తిరిగి, చిన్నశోధయాత్రలు చేసి ఈ గ్రామాలలోని సృజనాత్మకతను, సంప్రదాయ జ్ఞానాన్ని వెతికి మాకందించారు. వారి సేవాభావ ఫలితమే పదకొండేళ్ళ "పల్లెసృజన". ఎన్నాళ్ళు ఈ మహాప్రస్థానం జరుగుతుందో కాని సేవాభావంతో కూడిన సహజ జ్ఞానప్రసరణ, తెలుగు పత్రికా రంగ చరిత్రలో తనకంటూ ఒక స్థానాన్ని కల్పించుకుందున్న విశ్వాసం మాకుంది. వాలంటీర్ల కృషి, పాఠకుల సంపూర్ణ ప్రోత్సాహం, 'పల్లెసృజన' భవిష్యత్తులో కూడా కొనసాగేలా చేస్తుందని మనసారా ఆశిస్తున్నాము.

ఈమధ్య ఆకాశవాణి, హైదరాబాదు (ఎఫ్.ఎమ్) వారు 'పల్లెసృజన'తో ఒక "ఫోన్-ఇన్" కార్యక్రమం ప్రసారం చేశారు. ఓగంట కార్యక్రమంలో పన్నెండు మంది గ్రామవాసులు ఫోన్‌లో వారి అభిప్రాయాలను, సందేహాలను, సమస్యలను, పరిష్కారాలను పంచుకున్నారు. మాకు ఒక్క గంటలో ఎన్నో కొత్త విషయాలు తెవుసుకునే అవకాశం కలిగింది. ఈ కార్యక్రమంలో రైతులు ముఖ్యంగా మూడు సమస్యలు మాతో ప్రస్తావించారు. వాటికి పరిష్కారం లభిస్తే వేలాదిమంది రైతులు లాభపడతారని వారి ఉద్దేశ్యం. ఈ సమస్యా వివరాలను ఈ సంచికలో ప్రచురించాం. పరిష్కారాలు త్వరలో సమాజం సూచిస్తుందని ఆశిస్తున్నాం.

ఆకాశవాణి కార్యక్రమం తర్వాత కూడా తెలుగు రైతులు పల్లెసృజనతో సంభాషిస్తున్నారు. ఒక రైతు 'బాలయ్య' మాతో రేషన్ బియ్యం గురించి చర్చించారు. మావద్ద సన్నబియ్యం కొని, రేషన్ ద్వారా దొడ్డు బియ్యం మాకే సరఫరా చేస్తున్నారని వాపోయాడు. దొడ్డు బియ్యం అతి చవకగా లభించినా వాటిని ఎవరూ తినటం లేదంటూ, పందులకు పెట్టడమో లేక పిండిగా చేసుకోవడమో, అమ్మేయడమో చేస్తున్నారు. తిరిగి రైతులు మార్కెట్‌లో సన్నబియ్యం ఎక్కువ ధరలో కొంటున్నారని చెప్పాడు. పల్లెసృజన బాలయ్యకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఒక సలహానిచ్చింది. రైతులు ధాన్యాన్ని పండిస్తూ ప్రభుత్వం నుండి ముష్టికై ఎగపడటం ఏవిధంగానూ సమంజసం కాదు. వారి ధాన్యాన్ని వారే గ్రామాల్లో చిన్న రైసుమిల్లులో బియ్యం చేసుకొని తమకై వాడుకోవాలి. మిగతా ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మాలి. దీంతో ప్రభుత్వం గ్రామాలకు బియ్యం సరఫరా చేయాల్సిన అవసరం ఉండదు. అయితే గ్రామాల్లో కొందరు భూమిలేని వాళ్ళుంటారు, వారికై భూమి ఉన్న రైతులు బియ్యం తయారు చేసి వారికి తక్కువ ధరలో (రైతుకు నష్టం కాకుండా) అమ్మాలి. అందుకు మినీ రైస్ మిల్లులను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలి. ఈవిధంగా గ్రామవాసులు తమ భోజనానికి కావలసిన సరియైన బియ్యం, మంచిరకం పండించుకొని తృప్తిగా రోజూ భోజనం చేయవచ్చు. తక్కువ ఖర్చులో ఈ సౌకర్యం ప్రతి గ్రామాల్లో వారంతట వారే ఇలాంటి పద్ధతిని అవలంభించడం కష్టతరం కాదు. దేశవ్యాప్తంగా ఈ పద్ధతిని అన్ని గ్రామాల్లో అమలు చేస్తే, రేషన్ బియ్యం సరఫరా యంత్రాంగం ఒక్కపట్టణాలకే పరిమితమై ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల ఖర్చు ప్రతి సంవత్సరం మిగులుతుంది. అంతే కాకుండా గ్రామీణ పేద ప్రజలు ప్రభుత్వంపై ఆధార పడటం పూర్తిగా తగ్గి, వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, సుస్థిరతకు దారి తీస్తుందని 'పల్లెసృజన' విశ్వాసం. రైతు బాలయ్య మాతో అంగీకరించడమే ఈ నమ్మకానికి కారణం. ఈ సంచికలో మినీ రైస్‌మిల్లుల గురించి వివరాలు ప్రచురించాము. వీటిని రైతులు, ప్రభుత్వం గమనించి, గ్రామాలకు సరఫరా చేస్తే ఎంతో లాభసాటిగా ఉంటుంది.

21వ శతాబ్ది రెండవ దశాబ్దంలో గ్రామీణ ఇన్నోవేషన్లకు గ్రామ ప్రజల క్రియాశీలతకు ప్రస్తుత వ్యవస్థ పీట వేయటం ప్రారంభించింది. సమాజంలోని వివిధ వర్గాల ఆలోచనా విధానాలలో, వ్యవస్థాగత కార్యక్రమాల్లో, కళాశాల విద్యావిధానాల్లో, కేంద్ర ప్రభుత్వ పాలసీ దృష్టి కోణాల్లో గ్రామీణ ఇన్నోవేషన్లు మెల్లి మెల్లిగా స్థానం చోటు చేసుకుంటున్నాయి. సమాజంలో మార్పుగా వచ్చిన ఈ నూతన పరిణామం పల్లెసృజనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. సమాజంలోని అన్ని వర్గాల్లో, ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థల్లో గ్రామీణ జ్ఞానం శాశ్వతంగా ఒక 'మూలాంశం' అయ్యే వరకు 'పల్లెసృజన' ప్రయాణం, శోధయాత్రలు, వాలంటీర్ల గ్రామ ప్రయాణాలు, ఇన్నోవేషన్ల ప్రదర్శనలు, కళాశాల, పాఠశాల విద్యార్థులతో చర్చలు, పల్లెసృజన ప్రచురణలతో ప్రజలతో మమేకమై వారిని జ్ఞాన ప్రదాతలుగా చూసే దృష్టికోణం. వందలాది వాలంటీర్ల సహాయంతో ఈ జ్ఞాన ఉద్యమాన్ని పల్లెసృజన ముందుకు సాగిస్తుందని నిశ్చితంగా, వినయంగా తెలియజేస్తున్నాము.

వర్షాకాలపు ఒడిదుడుకులతో సతమతమవుతూ, ముమ్మరమైన పంట పొలాల పనులలో పూర్తిగా నిమగ్నమైన రైతక్కలకు, రైతన్నలకు 'పల్లెసృజన' శుభాకాంక్షలు.



భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**

# రైతన్నలకు కొమ్మూరి విజయ కుమార్ సూచనలు-సలహాలు



**- వీర రాఘవ రెడ్డి**

**కడప జిల్లా ఆదర్శ రైతు, రైతుల శ్రేయస్సు కొరకు నిర్విరామంగా పాటు పడుతున్న రైతు కొమ్మూరి విజయ కుమార్ వచ్చే సెప్టెంబర్ – అక్టోబర్ మాసాల్లో రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలను అందజేస్తున్నారు. రైతులు ఈ సూచనలను సందర్భానుసారంగా గ్రహించి పాటించ గలరని ఆశిస్తూ ఆయన సలహాలను మీకు అందిస్తున్నాము. -ఎడిటర్.**

సెప్టెంబర్, అక్టోబర్ మాసాలు పప్పు దినుసుల సాగుకు మంచి అనుకూలమైన కాలము. పప్పు దినుసులైన శనగ, పెసర, ఉలవలు మరియు తెల్లజొన్న, పచ్చ జొన్నలతో పాటు ధనియాలు కూడా సాగు చేసుకునేందుకు చాలా అనువైన సమయము అంటున్నారు. ఈ పంటల ప్రత్యేకత ఏమిటంటే ఈ మాసాల్లో ఒక మంచి వర్షం పడిన తర్వాత వీటిని విత్తుకుంటే ఆ తర్వాత పెద్దగా వర్షాల అవసరం లేకున్నా, కేవలం ముమ్ముందు వీచే పైర గాలితోనే మంచి పంటలను అందించే గుణమున్న పంటలు. జొన్న, ఉలవలను పుబ్బ కార్తిలో కూడా విత్తుకోవచ్చు. పూర్వం రైతులు 'పొలంలో కాళ్ళు కాలుతున్నా, జొన్న విత్తండి, పైర గాలికి పండిపోతుంది' అనేవారు.

సెప్టెంబర్ మాసం కూరగాయల సాగుకు అంత అనువైన సమయం కాదు. ఈ సమయంలో వర్షం తగ్గుముఖం పడుతూ భూమి చల్లబడుతుంది. అంటే చలి ప్రవేశించే సమయం. ఆకాశం మేఘావృతమై వుంటడంతో పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పంట విత్తేముందు 1 లీటరు పశువుల మూత్రము, 5 లీటర్ల నీరు, 50 గ్రాముల మైలతుత్తము లను బాగా కలియబెట్టి, విత్తబోయే విత్తనాలపై చల్లి విత్తన శుద్ధి చేయాలి. వీటిపై బూడిద కలిపినా మంచిదే. బూడిద కలపటం వల్ల పొలంలో 'మల్లె' రాకుండా నివారిస్తుంది.

పంట విత్తిన తర్వాత గ్రామ శివారులు, దిబ్బలపైన, పొలం గట్లలో వుండే మొక్కలలో ఎటువంటి పురుగును ఆశించని ఆకులను గమనించి వాటిని

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**



"గోల్డ్ బరిగ" పంట

సేకరించండి. ఇందులో కొన్ని మొక్కలు పాలు కారేవి, కొన్ని మొక్కలు పాలు కారనివి వుంటాయి. ఈ రెండింటినీ సేకరించండి. ఈ రెండు రకాల ఆకులను మెత్తగా దంచి, బాగా మురగబెట్టండి. ఒక వారం తర్వాత ఆ నీటిని వడబోసి భద్రం చేసి వుంచుకోవాలి. పంట మొలకెత్తిన వారం– పది రోజుల తర్వాత నుండి మొక్కలపై మీరు వడబోసి భద్రపరచుకున్న ద్రావణాన్ని వారానికోసారి చొప్పున మూడు లేదా నాలుగుసార్లు పిచికారి చేసినట్లయితే చీడ పీడల బారినుండి మీ పంటను రక్షించుకొని, మంచి దిగుబడులను సాధించవచ్చు.

గతంలో తాను చెప్పినట్లుగా ఏ పొలం గట్టున వున్న ఆరోగ్యవంతమైన మొక్కలు ఆ పొలంలోని చీడ పీడల నివారణకు ఉత్తమమైన పురుగు మందుగా పని చేస్తాయి, ఇది సృష్టి ధర్మం అంటారు విజయ కుమార్. మీ పొలాలను చీడపీడల నుండి కాపాడే పురుగు మందు మీ పొలం గట్టులోనే వుంది దాన్ని ఉపయోగించుకోండి, ప్రకృతి మీ పొలం సమస్యకు ఆ గట్టునే పరిష్కారం కూడా చూపిస్తుంది. దాన్ని వినియోగించుకోకుండా, విచ్చలవిడిగా రసాయన మందులు వాడటం వల్ల సమాజానికి అనారోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతో పాటు, రైతులు కూడా ఆర్థికంగా నష్టపోతున్నారు అన్నది అందరికీ తెలిసిందే.

అనుకూలమైన సమయంలో ఆయా పంటలను పండించకుండా వ్యతిరేకమైన సమయాల్లో పండించే పంటల వల్ల ఆయా పంట దిగుబడుల్లో పోషక విలువలు నశించే అవకాశం చాలావరకు వుంటుంది అంటారీయన. మే జూన్‌లలో వేయాల్సిన పంటలు, ఆగస్టులో వేసి, ఆగస్టులో వేయాల్సిన పంటలను నవంబర్ డిశంబర్‌లలో వేయటం వల్ల రైతుకు అన్ని విధాల నష్టమే అంటున్నారీయన. అందుకే పంటలు విత్తడానికి అదును తెలుసుకోవటం చాలా మంచిది అంటున్నారు. అలా వీలుకాని సమయాల్లో పంటలను వేయటం వల్ల సరియైన దిగుబడికై ఎరువులు, రసాయన మందులు విపరీతంగా అందించాల్సి వస్తోంది అంటున్నారు విజయకుమార్.

సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో పప్పు ధాన్యాలతో పాటు "గోల్డ్ బరిగ" (బంగారు కలలు), "ఊదర్లు" పంటలను కూడా సాగు చేసుకోవచ్చు. కొర్రబియ్యం గుండ్రంగా వున్నట్లనిపించినా కొద్దిగా పొడవుగా వుంటాయి కానీ 'ఈ బంగారు కలలు' అనే బియ్యం పూర్తి గుండ్రంగా వుండి కొద్దిగా బంగారం రంగులో మెరుస్తూ కనిపిస్తాయి. ఈ బియ్యంతో వండిన అన్నం చాలా రుచిగా, ఆరోగ్యవంతంగా వుంటుంది. ఈ రకం గింజలను కర్నాటక లోని 'మైసూర్' నుంచి తమిళనాడు లోని 'ఈరోడ్' వరకు వర్షాధార పంటగా విరివిగా పండిస్తారు. వీటిని పండించి గత కొన్ని సంవత్సరాల్లో ఆరున్నర టన్నుల వరకు విత్తనాలను ఉభయ రాష్ట్రాల్లోని తెలుగు రైతులతో పాటు, కొందరు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా పంపించారు విజయ కుమార్.

ఇవి బలమైన పొలాల్లో మూడున్నర అడుగుల ఎత్తు వరకు పెరిగి, జల్లి కంకిలా వస్తుంది, ఎకరాకు 8 నుండి 10 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది. బంగారు కలలు బియ్యం ఆరోగ్యవంతమైన అన్నం. వీటి ధర కిలో 30 నుండి



"అండుకొర్ర" పంట

నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.

40 రూపాయల వరకు వుంటుంది. అంతే కాదు, ఈ గడ్డిని కూడా పశువులు చాలా ఇష్టంగా తింటాయి. ఈ పంటకు పురుగు మందులు, అధిక ఎరువులు వేయాల్సిన అవసరమే ఉండదు.

అలాగే సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో 'అందుకొర్ర' సాగు కూడా మంచి లాభసాటిగా వుంటుంది. ఇది కూడా ఎకరాకు 6 నుండి 8 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది. వీటి గడ్డి కూడా పశువులు ఎంతో ఇష్టంగా తింటాయి, ఇది వాటికి బలమైన ఆహారం కూడా.

ఇప్పటి వరకు పెద్దగా వర్షాలు పడని ప్రాంతాల రైతులు ఇప్పుడు పడుతున్న వర్షాలకు పైన వివరించిన 'గోల్డ్ బరిగ', అందు కొర్ర, ఉదలు, కొర్రలను సాగు చేస్తే పశువులకు మంచిగడ్డి, మానవాళికి బలవర్ధకమైన ఆహారం అందించిన వారమవుతాము అంటున్నారు విజయ కుమార్.

అరికలు, సామలు లాంటి విత్తనాలు ఇప్పుడు వేయవద్దు, అవి ఇప్పుడు విత్తినట్లయితే సరియైన దిగుబడి వచ్చే అవకాశాలు చాలా తక్కువ అంటున్నారాయన.

సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో చీని, నిమ్మ, బత్తాయి, సపోట తోటలు కాపుకు వచ్చే సమయం. ఆగస్టు చివరి వారంలో పూత ప్రారంభమై సెప్టెంబర్ చివరి వారం నుండి పంట కోత ప్రారంభమౌతుంది. ఈ సమయంలో మచ్చ తెగులు, గజ్జి తెగులు లాంటి ఆశించే ఆస్కారముంది. జెముడు–సునాముఖి ద్రావణం, పచ్చ గన్నేరు – అలోవీర ద్రావణం, వెర్రిపుచ్చ – నల్లేరు ద్రావణం తయారు చేసుకోవాలి. వీటిని వేర్వేరు నీటి డ్రమ్ముల్లో ఒక్కోటి 5 కిలోల మోతాదుతో తీసుకుని బాగా నలగగొట్టి ఆ నీటిలో నానబెట్టి, బాగా మురిగిన తర్వాత వడబోసి ఉంచుకుని, వారానికోసారి మార్చి మార్చి పిచికారి చేసినట్లయితే, నాణ్యమైన దిగుబడి వస్తుంది, రైతుకు మార్కెట్లో కూడా మంచి ధర వస్తుంది. పండ్ల తోటల్లో చెట్ల మొదళ్ళ వద్ద 'సున్నము – మైల తుత్తం'తో బోర్డో పేస్ట్ తయారు చేసుకుని చెట్ల కాండాలకు పూస్తే కొన్ని రకాల కీటకాలు చెట్లను ఆశించవు. ●

**విజయ కుమార్‌ను సంప్రదించాల్సిన ఫోన్ నెం. :**
**9849648498**


## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.


మల్లేష్ ఫెడల్ పంపు



రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం


కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు


గోపాల్ భీసే సైకిల్ నాగలి



మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.


మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.

# రైతుల కొరకు రైతులు తయారు చేసిన అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు

## మల్టిపర్పస్ ఫుడ్ ప్రాసెసింగ్ మిషన్




- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం :
జె. శశిమోహన్

**సమస్య – పరిష్కారం :**

ఔషధాలకి వాడే తినగలిగిన, తినలేని పళ్ళ నుండి రసము, గుజ్జు, నూనెలు, సారము తీయటానికి కలపటము, దంచటము, ఉడకబెట్టటము, పిండటము లాంటి అనేక ప్రక్రియలు చేయాల్సి వుంటుంది. ఔషధ మరియు ఆహార పదార్థాల తయారు చేసే సంస్థలు తమ ఉత్పత్తులను తయారు చేయటానికి దంచటానికి, కలపటానికి, ఉడకబెట్ట డానికి, ఆవిరి పెట్టి రసాలు, నూనె, గుజ్జు చేయటానికి వేర్వేరు యంత్రాలను ఏర్పాటు చేసుకుంటారు. ఇవన్నీ చేసే ఒక యంత్రం ఎక్కడా లేదు. హర్యానాకు చెందిన 'ధర్మవీర్ కాంభోజ్ అటువంటి అన్ని పనులు చేసే ఒకే యంత్రాన్ని రూపొందించాడు.

ఉదా.: 1. ఈ యంత్రంలో టమోటాలను ఉపయోగించి, టమోట సాస్, టమోట గుజ్జు, టమోట పొడి, సారము(పిప్పి)

**సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.**

లను వేర్వేరుగా చేసుకుని ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు.

2. అదేవిధంగా ఉసిరి కాయలను ఉపయోగించి ఉసిరి ఒరుగులు, ఉసిరి జామ్, ఉసిరి పొడి, ఎస్సెన్స్‌లను తయారు చేసుకోవచ్చు.

**పరికరం :**

తేలికగా ఎక్కడికైనా తీసుకు వెళ్ళడానికి వీలైన ఈ యంత్రం సహాయంతో అనేక రకాల పళ్ళు, కూరగాయలు, ఔషధ మొక్కలు, విత్తనాల నుండి అనేక ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు. దీనినే ప్రెషర్ కుక్కర్‌గా కూడా ఉపయోగించవచ్చు. దానికై వేడిని నియంత్రించి, తగిన వేడి కాగానే దానంతట అదే ఆగిపోయేలా చేసే సదుపాయం కూడా ఉంది. ఔషధ మొక్కల పూలు, ఆకులను ఇందులో వేసి వాటినుండి అవసరమైన వివిధ రకాల ఉత్పత్తులను సులభంగా తయారు చేసుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

- సింగిల్ ఫేస్ కరెంటుతో పని చేస్తుంది.
- గంటకు ఒకటిన్నర యూనిట్ల కరెంటు ఖర్చవుతుంది.
- ఈ యంత్రం 125 కిలోల బరువుంటుంది.
- దీనికి చక్రాలు ఏర్పాటు చేయటం వల్ల ఎక్కడికైనా సులభంగా లాక్కెళ్ళవచ్చు.
- దీని మోటరు 1440 ఆర్పియంతో పని చేస్తుంది.
- రోటరు వేగం 360 ఆర్పియం.
- మొదటి రకం మాడల్‌లో గంటకి 50 కిలోల రసం, రెండో రకం మాడల్‌లో గంటకి 150 కిలోల రసం తీయవచ్చు.



- రెండు హీటర్లు కలిగి, దానంతట అదే వేడిని నియంత్రిస్తూ తగినవేడికి చేరగానే ఆఫ్ అవుతుంది.

**ముఖ్యాంశాలు :**

- వేడిని నియంత్రిస్తూ ఉడకబెట్టే పద్ధతి.
- పళ్ళు, పూలు, కూరగాయలు, ఔషధ దినుసులు - మొక్కలు, ఆకులు లాంటి అనేక రకాల పదార్థాలను విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసుకోవచ్చు.
- అలోవీరను ఉపయోగించి హెర్బల్ జ్యూస్, హెయిర్ జెల్, ఫేస్ వాష్, షాంపూ, హ్యాండ్ వాష్, ఎక్ట్రాక్ట్, పౌడర్‌లను తయారు చేసుకోవచ్చు.
- మామిడి పళ్ళను ఉపయోగించి, జ్యూస్, చట్నీ, జామ్ మొదలైనవి తయారు చేసుకోవచ్చు.
- ఉసిరిని ఉపయోగించి పౌడర్, హెక్స్‌ట్రాక్ట్ (పిప్పి), జ్యూస్, హెయిర్ ఆయిల్, జామ్, తీపి పదార్థాలు, లడ్డూలు చేసుకోవచ్చు.
- తులసి, అశ్వగంధ, శతావరి ఇతర మూలికలను ఉపయోగించి రసాలు, ఎక్స్‌ట్రాక్ట్ చేసుకోచవచ్చు.
- గులాబి, మల్లె, ల్యావెండర్ లాంటి పూలను ఉపయోగించి సెంటు, ఎక్స్‌ట్రాక్ట్ చేసుకోవచ్చు.
- వ్యక్తులు, మహిళా సమూహాలు, యువత ఉపాధి కల్పనకి ఎంతో ఉపయుక్తమైనది.
- ఆటోమేటిగ్గా పని చేస్తుంది కనుక ఆరోగ్యదాయక మైనది.
- దీన్ని ఉపయోగించి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయటం వల్ల వృధా అనేదే లేకుండా ఆర్థికంగా లాభకరంగా ఉంటుంది.

**పురస్కారాలు :**

- 2009లో భారత రాష్ట్రపతి 5వ జాతీయ స్థాయి పోటీలలో ధరమ్‌వీర్‌ను సత్కరించడం జరిగింది.

**వివరాలకు సంప్రదించండి:**

పల్లెసృజన, ప్లాట్ నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

కష్టాల సారాంశమే విజయం.

# అభివృద్ధి చేయబడ్డ కంది రకం
# కుద్రత్-3



- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జె. శశిమోహన్

**ఆవిర్భావం :**

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రైతు 'ప్రకాష్ సింగ్ రఘువంశీ' ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న 'ఆశా' కంది రకం నుండి ఎంపిక చేసిన పద్ధతిలో అనేక ప్రయోగాలు చేసి, ఈ కుద్రత్-3 అనే కంది రకం విత్తనాన్ని రూపొందించాడు. ఎక్కువ కాయలు కాసే ఈ రకం కంది ఆ ప్రాంత రైతుల మన్ననలు కూడా అందుకుంది. ప్రస్తుత కాల పరిస్థితుల్లో ఎక్కువ దిగుబడి సాధించే విత్తనాల అవసరం రైతులకు ఎంతో ఉంది.



**ప్రత్యేక లక్షణం :**

- పెద్ద గింజలు.
- ఆరోగ్యంగా బలంగా ఉండే మొక్క.
- వంద గింజల బరువు సుమారు 18 గ్రా.
- హెక్టారుకు 3000–3500 కిలోల దిగుబడి.

**అనువైన వాతావరణం :**

- ఉష్ణ మండలాల్లో, ఉప ఉష్ణ మండలాల్లో వేయటానికి అనువైనది.
- మొక్క ఎదిగేవరకు తడితో కూడిన వేడి వాతావరణం ఉష్ణ వాతావరణం ఉండాలి.
- కాయలు వచ్చే సమయానికి ఎండ బాగా ఉండాలి.

**ఇతర లక్షణాలు :**

- విత్తనాలను 2 సంవత్సరాల వరకు నిలువ చేసుకోవచ్చు.
- కాలానుగుణంగా పండే పంట.

**విత్తనాలకు సంప్రదించండి:**

పల్లెసృజన, ప్లాట్ నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094. ఫోన్ : 040–27111959, సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

వేలకొద్దీ నీతులు బోధించేకన్నా, ఒక్క నీతి ఆచరించి చూపు

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

### శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము

## జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

### పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సమూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైనవి) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో 35 నుండి 52 శాతం సొమ్మును నెలసరి ఉపకార వేతనము (Fellowship) రూపంలో అందజేయ బడుతుంది. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road,**
**Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

## రైతులకు ఎంతో ఉపయోగపడే, అదనపు ఆదాయన్నిచ్చే

# 'బియ్యం పట్టే చిన్న మర' (మినీ రైస్ మిల్)



- జులై 2017 'సివిల్ సొసైటీ' పత్రిక శ్రీపాద్రే వ్యాసం ఆధారంగా

రైతులు ధాన్యం పండించిన తర్వాత ఆ ధాన్యాన్ని మర పట్టించి, బియ్యంగా చేసి మార్కెట్‌లో అమ్మటానికి అనేక వ్యయ ప్రయాసలకు లోను కావాల్సి వస్తుంది. ధాన్యాన్ని మిల్లుదాకా రవాణా చేయటమే ఎంతో కష్టతరమైన, ఖర్చుతో కూడుకున్న పని. మిల్లులో ధాన్యం మర పట్టించిన తర్వాత దాని ఊక, తౌడు వేరు చేసి పాలిష్ చేసిన తెల్ల బియ్యం మార్కెట్ చేయటానికి అనువుగా తయారవుతుంది.




**బైరెన్‌సింగ్ మినీ రైస్‌మిల్ :**

మణిపూర్ రాష్ట్రంలోని 'ఇంపాల్' పట్టణానికి చెందిన ఇన్నోవేటర్ రూపొందించిన ఈ మినీ రైస్‌మిల్ బియ్యాన్ని వలుస్తుంది, వలిచిన బియ్యాన్ని పాలిష్ చేస్తుంది, ఆ తర్వాత జల్లి పడుతుంది. ఇలా మూడు రకాల పనులను చేస్తుంది. ఇలా వండుకుని తినటానికి అనువైన మంచి బియ్యాన్ని అందిస్తుంది. కేవలం ఒక హార్స్‌పవర్ మోటార్‌తో నడిచే ఈ మినీ రైస్‌మిల్ గంటకు 100 కిలోల బియ్యాన్ని మర పడుతుంది. మామూలు మిల్లుల్లో లోపల వున్న ఇసురాయి భూమికి సమాంతరంగా (అడ్డంగా) తిరుగుతుంది. కానీ, ఇందులోని ఇసురాయి నిలువుగా తిరుగుతుంది. కాబట్టి ఎక్కువ స్థలాన్ని

ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు. కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.

ఆక్రమించకుండా తక్కువ స్థలంలో నాణ్యమైన బియ్యాన్ని అందిస్తుంది. ఈ ఇన్నోవేషన్ ఎన్.ఐ.ఎఫ్. ద్వారా గుర్తింపబడి మార్కెట్ చేయబడుతున్నది.

కావలసిన వారు సంప్రదించండి :

**సుభాష్, పల్లెసృజన. ఫోన్ : 96528 01700**

**అన్నపూర్ణ రైస్‌మిల్:**

గత కొన్ని సంవత్సరాలుగా కర్నాటక, మహారాష్ట్ర లకు చెందిన రెండు ఇంజనీరింగ్ కంపెనీలు వాషింగ్ మిషన్ పరిమాణంలో వుండే 'మినీ రైస్ మిల్లు'లను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇవి చిన్నగా వుండి, ఒక చోటు నుండి మరో చోటుకు తీసుకు వెళ్ళటానికి అనువుగా వుండి, తక్కువ ఖర్చులో అందుబాటులోకి వచ్చాయి. రైతులు ఎవరికి వారు కాని, కొందరు రైతుల సమూహం కాని ఈ యంత్రాన్ని కొనుగోలు చేస్తే సౌకర్యంగా వుంటుంది. కర్నాటక లోని చెన్నగిరి, బసవ పట్నకి చెందిన 'మంజునాథ్' అనే రైతు "ఈ మినీ రైస్ మిల్లులో 60 నుండి 70 శాతం బియ్యం వస్తుంది కనుక వృధా తక్కువ". మేము మా ధాన్యాన్ని పెద్ద రైసు మిల్లుకు తీసుకువెళ్ళినపుడు చాలా మటుకు బియ్యం పైపులలోనే ఉండిపోయేవి. ఈ చిన్న మిల్లులో అటువంటి సమస్య లేదు. నేను నా తోటి రైతులు కొందరితో కలిసి ఒక ట్రక్కులో ధాన్యాన్ని తీసుకు వెళ్ళేవాళ్ళం. అక్కడ మిల్లు దగ్గర మా వంతు వచ్చి, బియ్యం తీసుకు రావటానికి చాలా సమయం పట్టేది. ఈ మినీ రైస్ మిల్లు కొన్న తర్వాత ఆ బాధలన్నీ తప్పాయి" అన్నాడు.




మంజునాథ్ కర్నాటక లోని షిమోగ జిల్లాలో 40 సంవత్సరాల నుంచి వున్న 'మారుతి ఇంజనీరింగ్' సంస్థ నుండి ఈ మినీ రైస్‌మిల్లును కొనుగోలు చేశాడు. ఆ సంస్థ వారు ఈ మినీ రైస్ మిల్లును ఒక సంవత్సరం క్రితం రూపొందించారు. 3 హార్స్‌పవర్‌ల మోటార్‌తో నడిచే ఈ మిల్లు గంటకి 150 కిలోల వరకు బియ్యాన్ని తయారు చేస్తుంది. ఆ సంస్థ కొత్తగా అమ్మకాలు ప్రారంభించినపుడు దీని ధర 50 వేల రూపాయలుండేది. కాలక్రమేణా అనేక మార్పులు, చేర్పులు చేసి ప్రస్తుతం దీనిని రూ. 25 వేలకే అమ్ముతున్నారు.

కావలసిన వారు సంప్రదించండి :

**Annapurna Agro International Pvt. Ltd.**
Ganeswarpur Industrial Estate, Januganj, Balasore, Odisha-756019. Phone-06782-244881,244882.

**మారుతి రైస్‌మిల్ :**

మారుతి ఇంజనీరింగ్ సంస్థ యజమాని 'కె.యస్. హాలస్వామి' తాము ఇంతవరకు 200 వరకు యంత్రాలను అమ్మామని, వాటిలో 2016–17 సంవత్సరం లోనే 125 యంత్రాలను అమ్మామని చెబుతూ, ఈ మినీ రైస్‌మిల్లు నిర్వహణ చాలా సులభమైనది, చాలా తక్కువ ఖర్చుతో కూడినది. దీనిని ఒక ఆటో రిక్షాలో తీసుకు వెళ్ళవచ్చు. మేము అమ్మిన యంత్రాల్లో ఎక్కువ భాగం పశ్చిమ బెంగాల్ చేరుకున్నాయి. కొన్ని కర్నాటకలో, మిగతావి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతులు కొనుగోలు చేశారు.

కొందరు రైతులు పెట్రోలుతో పని చేసేలా వుంటే బావుండునని సలహా ఇచ్చారు. మేమా విషయం ఆలోచిస్తున్నాము. ఈ యంత్రంలో ఉడకబెట్టిన బియ్యం కూడా మర ఆడించుకోవచ్చు. కాని, ఈమధ్యనే గిరాకీ పెరుగుతున్నా, పాలిష్ చెయ్యని బియ్యం (ఎర్రబియ్యం) మాత్రం చేయటం సాధ్యం కాదు. ఆ విషయమూ ఆలోచిస్తున్నాము.

**విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.**



మేము తయారు చేసిన మినీ రైస్‌మిల్లు మార్కెట్‌లోకి వచ్చేముందు అందుబాటులో వున్న చిన్న రైస్‌మిల్లులు 8 క్వింటాళ్ళ సామర్థ్యం కలిగి 10 హార్స్‌పవర్‌ల మోటర్‌తో పని చేసేవని, 3 నుండి 4 లక్షల రూపాయల వరకు ఖరీదులో లభించేవన్నారు.

తనకి చిన్న రైస్‌మిల్లు చేయాలి అన్న ఆలోచన రెండు సంవత్సరాల క్రితం చైనాలో తాను చూసిన రూ. 3 లక్షలు ఖరీదు చేసే ఒక చిన్న రైస్‌మిల్లు చూడటం ద్వారా వచ్చింది. ఆ యంత్రం గురించి వాకబు చేయగా అది అసలు జపాన్‌లో తయారు చేయబడిందని చెప్పారట. ఈపాటి యంత్రం ఇంకా చిన్నగా, ఇంకా చవకగా తయారు చేసి మన రైతులకి అందుబాటులోకి తీసుకు రావాలి అన్న ఆలోచన వచ్చిందని అన్నారు. తాను ఎంతో శ్రమించి 8 యంత్రాలు తయారు చేసిన తర్వాత 9వ యత్రం తనకు సంతృప్తిని ఇచ్చిందని, దానిని మార్కెట్‌లోకి విడుదల చేశానని చెప్పారు. ఈ మిల్లులో వున్న సౌకర్యం తక్కువ ధరలో లభిచటమే కాకుండా, దీనిని కావలసిన చోటికి తీసుకు వెళ్ళవచ్చు. రైతులు తమ ధాన్యాన్ని తమ ఇంట్లోనే బియ్యంగా మార్చుకోవచ్చు. తమిళనాడుకు చెందిన కొందరు నిరుద్యోగులు వీటిని కొని, గ్రామాల్లో జీవనోపాధి పొందుతున్నారు అన్నారు.

కర్నాటక లోని చెన్నగిరి, అక్కలకట్టె గ్రామానికి చెందిన రైతు యస్. శశికుమార్ తాను 8 నెలల క్రితం ఈ మినీ రైస్‌మిల్లు కొన్నానని, చాలా బాగా పని చేస్తోందని, కంపెనీ వారు కూడా మంచి సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. కావలసిన వారు సంప్రదించండి :

**హాలస్వామి, కర్నాటక, ఫోన్ : 9845573633**

మహారాష్ట్రలో 'తేజం' అనే సంస్థ కూడా ఇటువంటి మినీ రైస్ మిల్లులను చాలా సంవత్సరాలుగా తయారు చేసి విక్రయిస్తోంది. మూడు సంవత్సరాల క్రితం ఈ కంపెనీ 'స్వార్ నీమ్ మెషీన్ సేల్స్' గా తన పేరు మార్చుకుంది. తమ యంత్రం నమూనాలు కూడా మార్చి ప్రస్తుతం కేవలం 50 కిలోల బరువున్న యత్రాన్ని అమ్ముతోంది. సంస్థ యజమాని 'ప్రశాంత్ గోలే' తాము గత రెండు సంవత్సరాలలో 100కి పైగా యంత్రాలను అమ్మామని చెబుతూ, తమ యంత్రం పేరు 'తృప్తి' అని, 3 హార్స్‌పవర్‌ల సింగల్ పేస్‌తో కరెంటు నడిచే మోటారు కలిగి వుంటుందని అన్నాడు. దీని ధర రూ. 30 వేలు అని, గంటకి 120 నుండి 150 కిలోల బియ్యాన్ని మర ఆడిస్తుందని అన్నారు. తమ యంత్రాన్ని కలకత్తా, ఒడిస్సా రాష్ట్రాల్లోని రైతులే కాక, స్థానికంగా కొల్హాపూర్, రత్నగిరి తదితర ప్రాంత రైతులు కూడా కొనుగోలు చేశారని చెపుతూ ప్రస్తుతం కేరళ రాష్ట్ర రైతులు కూడా అడుగుతున్నారని తెలియజేశారు. తమ ఈ యంత్రం మూడున్నర అడుగుల ఎత్తు, ఒకటిన్నర అడుగుల వెడల్పు ఉంటుందని, చిన్న వాహనంలో కాని, ఆటో రిక్షాలో కాని తీసుకు వెళ్ళటానికి అనువుగా ఉంటుందని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని స్వంతంగా మర ఆడించుకోవటానికి అనువుగా ఉంటుందని, నిరుద్యోగుల ఉపాధి కల్పనకి ఉపయోగ పడుతుదని తెలియజేశారు.


రైతులు ధాన్యాన్ని పండించి తానే బియ్యంగా మార్చి, బియ్యాన్ని, తౌడుని, ఊకని అమ్ముకుని అధిక లాభాలు పొందటానికి ఈ యంత్రాలు దోహద పడుతాయని 'పల్లెసృజన' నమ్ముతోంది. గ్రామాలు స్వయం సమృద్ధి సాధించాలంటే తమ ఉత్పత్తులను విలువ పెంచి ముందుగా తమ గ్రామాల్లోనే అమ్మగలగాలి, మిగిలినవి పట్టణాలకు ఎగుమతి చేయాలే కానీ, ఏ వస్తువూ పట్టణాల నుంచి కొనుగోలు చేసే పరిస్థితులు రాకూడదు.

కావలసిన వారు సంప్రదించండి :

**ప్రశాంత్ గోలె, మహారాష్ట్ర, ఫోన్ : 94049 62803**

**దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.**

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




**జాతీయప్రథమ బహుమతి**

**మార్పు చేయబడ్డ గోధుమ/వరి నూర్పిడి యంత్రము**

**ఇన్నోవేటర్ : సురేంద్ర ప్రసాద్, సంత్ కబీర్ నగర్, ఉత్తర ప్రదేశ్.**



55 సం. వయసున్న సురేంద్ర ప్రసాద్ వ్యవసాయ యంత్రాలు రిపేరి, తయారు చేయటంలో నిష్ణాతులు. ఇతను వరి, గోధుమల నూర్పిడి యంత్రాన్ని తయారు చేశాడు. ఈ ప్రక్రియలో జరిగే మూడు రకాల పనులను అనగా కోత కోయటం, నూర్పిడి చేసి, గింజలను, పొట్టును విడివిడిగా సేకరించటం ఒకేసారి చేస్తుందీ యంత్రం.

ప్రసాద్ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న రోజుల్లోనే ఈయన తండ్రి క్షయ వ్యాధితో మరణించాడు. పూట గడవటమే కష్టంగా వున్న తరుణంలో ఏడుగురు సభ్యులున్న కుటుంబాన్ని పోషించటానికి పెద్దన్నకి వ్యవసాయ పనులలో చేదోడు వాదోడుగా ఉండటానికి చదువు మానేయాల్సి వచ్చింది. వ్యవసాయంలో వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబం గడవక పోవటంతో తన గ్రామంలోనే ఒక సైకిల్ రిపేరు షాపును ప్రారంభించాడు. అక్కడా ఎక్కువ ఆదాయం రాకపోవటంతో కొన్ని సంవత్సరాలకే దాన్నీ మూసివేయాల్సి వచ్చింది. డబ్బు సంపాదించాలనే ధ్యేయంతో రెండు మూడు సంవత్సరాలు ఇల్లు వదిలి పంజాబ్ రాష్ట్రంలో, పక్క రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ, తిరిగి 1985లో పంజాబ్ లోని సొంత ఊరికి చేరుకున్నాడు. చవకగా వస్తుందన్న ఉద్దేశ్యంతో తన ఊరికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఒక ట్రాక్టరు రిపేరు షాపు ప్రారంభించాడు. దాన్ని నడపటానికి అతని భార్య, ముగ్గురు కొడుకులు కూడా అందులోనే పనిచేసేవారు. కాలక్రమేణా ఆ వర్క్‌షాపు వృద్ధి చెంది మంచి ప్రాచుర్యం పొంది, తన కుటుంబం సాఫీగా గడిచిపోవటానికి తగ్గ ఆదాయం సమకూర సాగింది.



నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.

2007 ప్రాంతంలో పంజాబ్ రాష్ట్రంలో కొత్తగా పంట నూర్పిడి యంత్రాలను ప్రవేశ పెట్టడం జరిగింది. కాకపోతే ఆ యంత్రాలు కేవలం గింజలను సేకరించి, వృధాను పొలంలోనే వదిలేసేవి. రైతులు ఆ చెత్తనంతా ఏరివేయటం శ్రమతో కూడుకున్న పని కనుక పొలంలోనే తగులబెట్టేవారు. దాంతో ఆ చెత్త కాలీ కాలక, పొలంలో కొంత మిగిలిపోయి, మరుసటి పంట వేయటానికి ఇబ్బంది కరంగా ఉండటమే కాక, పశువులకు మేతగా పనికి రాక, భూసారంపై ప్రభావం చూపేది. అప్పుడే సురేంద్ర ప్రసాద్‌కు నూర్పిడి సమయంలో వృధాని కూడా సేకరించే యంత్రం తయారు చేయాలన్న ఆలోచన కలిగింది.

2010 ఆగస్టులో ప్రారంభించి, ఏప్రిల్ 2011 నాటికి అనేక కష్ట నష్టాలకు ఓర్చి ఒక యంత్రాన్ని రూపొందించ గలిగాడు. అదీ నచ్చక అనేక ప్రయోగాలు చేసి, ఏప్రిల్ 2014 నాటికి తాను అనుకున్న విధంగా సంతృప్తికరంగా పని చేసే నూర్పిడి యంత్రాన్ని తయారు చేయ గలిగాడు.

65 హార్స్‌పవర్‌లు ఆ పైన సామర్థ్యం కలిగిన ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి ఈ హార్వెస్టర్‌తో కోత, నూర్పిడి గింజలు, వృధాలను వేరువేరుగా సేకరించుకోవచ్చు. ఈ పరికరంలో గోధుమలను సేకరించటానికి, చిన్న చిన్న ముక్కలుగా చేసిన వ్యవసాయ వృధాలను పశుగ్రాసానికి పనికి వచ్చే విధంగా చేసి సేకరించటానికి వేరువేరు తొట్టెలను ఏర్పాటు చేశాడు. గింజలు దెబ్బ తినకుండా, గడ్డిని మాత్రమే ముక్కలుగా చేసి, గింజలను, పశుగ్రాసాన్ని వేరువేరుగా అతి త్వరలో సేకరించ గలదీ యంత్రం. ఒకసారి 8 క్వింటాళ్ళ గింజలను, 8 క్వింటాళ్ళ పశుగ్రాసాన్ని సకరించగల సదుపాయం ఇందులో వుంటుంది. అవి నిండిన తర్వాత వాటిని ఖాళీ చేసి మళ్ళీ వినియోగించు కోవాల్సి వుంటుంది. ఈ యంత్రాన్ని ఉపయోగించి ఒక ఎకరం పొలాన్ని ఒక గంటలో కోత, నూర్పిడి చేసుకోవచ్చు.

తన ఈ నూతన ఆవిష్కరణకి ప్రసాద్ పేటెంటుకై దరఖాస్తు చేసియున్నాడు. ●



**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది, ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్మలను గొప్పవాళ్ళను చేస్తుంది.**

**జాతీయప్రథమ బహుమతి**

**పశు వైద్యము**

**ఇన్నోవేటర్ : లాడుబేన్ సోమాభాయ్ భాంభి, సబర్‌కాంత, గుజరాత్.**

80 సంవత్సరాల సోమాభాయ్ సాంప్రదాయ వైద్యురాలు. ఆమెవద్ద మూలికా వైద్యం చిట్కాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేకించి పశువులలో 'గొడ్డు పోవటం' జరిగినపుడు ఆమె చక్కటి వైద్యాన్ని అందిస్తుంది.



తన భర్త చనిపోయిన తర్వాత కూతురు, అల్లుని వద్ద వుంటున్న సోమాభాయ్ ఈ ముసలితనంలో కూడా ఇంటి పనులు చేసుకోవటమే కాక, అవసరమైనపుడు తన మూలికా వైద్యంతో గ్రామస్తులకి సహాయ పడుతూ వుంటుంది. ఆమె భర్త ధనా భాయ్ వున్నపుడు కూడా అతను ఈమెను చాలా ప్రోత్సహించేవాడు. నలుగురికీ సేవ చేయటానికి ఎప్పుడూ వెనకాడకూడదని బోధించేవాడు. ఆమె గత 50 సంవత్సరాల నుంచి ఈ వైద్యం చేస్తోంది. తనకీ వైద్య చిట్కాలు తన తల్లివద్ద నుండి, భర్తవద్దనుండి సంక్రమించాయని, వాటికి తోడు తాను స్వంతంగా కొన్ని ప్రయోగాలు చేసి ఈ వైద్యం చేస్తూ వుంటానని చెప్పింది. పశువులకి మూలికా వైద్యం అందించటమే కాక, ఆమె ఊళ్ళో మహిళల ప్రసవాలకి కూడా మంత్రసానిగా సహాయం చేయటానికి వెళుతూ వుంటుంది.

పశువులు గొడ్డుపోవటం అన్నది ఒక వ్యాధి కాదని, అది సరైన పోషకాహారం లేకపోవటం, కాలాలలో మార్పు, భౌతిక వాతావరణంలో మార్పులు లేదా వయసులో వచ్చే మార్పులు అని చెబుతుందావిడ. ఈ స్థితి ప్రత్యేకించి ఆవులలో, గేదెలలో వుంటుందని, దానికి వైద్యం చేయటానికి ఆమె స్థానికంగా లభించే (పేటెంటు హక్కుల మూలంగా పేరు చెప్పటం కుదరటం లేదు) ఒక చెట్టు వేర్లను నూరి, నీటితో కలిపి పశువుచేత తాగిస్తుంది. పేటెంట్ హక్కుల సంస్థ వారు ఇది కొత్త పద్ధతి అని ఒప్పుకుంటూ మహారాష్ట్ర లోని నాగ్‌పూర్ పశువైద్య శాలలో, మహారాష్ట్ర అనిమల్ & ఫిషరీస్ సైన్స్ విశ్వవిద్యాలయం వారు దీనిపై తదుపరి పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలలో ఆవులలో 60 శాతం కేవలం 5 రోజుల లోపు, గేదెలలో 40 శాతం వారం లోపల ఫలితం కనిపించిందని నిర్ధారించటం జరిగింది. ఆవులలో 33 శాతం, గేదెలలో 75 శాతం చూలుకు రావటం జరిగింది.

పరిశోధనలలో భాగంగా ఈమెకి తెలిసిన ఈ పద్ధతి ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో ఇంకెవరికైనా తెలుసా? లేక ఉపయోగిస్తున్నారా? అని విచారించగా ఈమె ఒక్కతే ఆ చెట్టు వేర్లను ఈ వైద్యానికి ఉపయోగిస్తున్నట్టు నిర్ధారణ జరిగింది. ఈమె వైద్యం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ప్రజల సమస్యను తీర్చటానికి ఆమె జ్ఞానం యొక్క పాత్రను గుర్తెరిగి ఈ పురస్కారం అందజేయటం జరిగింది. ఆమె ఈ మందు విషయంలో తదుపరి పరిశోధనలు జరగటానికి తన సంసిద్ధతను వ్యక్తం చేసింది.

## ఎన్.ఐ.ఎఫ్. లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 25 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు,
సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై
ఒక వెబ్‌సైట్ తయారు చేసింది.
ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు.
అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞాన కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే
**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**
కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.
కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు
ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

ఇన్నోవేషన్లు

# అమ్మకానికి సిద్ధంగా ఉన్న
# రైతుల కొరకు రైతులు తయారు చేసిన స్ప్రేయర్లు



## బ్యాటరీ/ సోలార్ స్ప్రేయర్

ఇన్నోవేటర్ బొమ్మగాని మల్లేశం తయారు చేసిన ఈ "బ్యాటరీ/ సోలార్ స్ప్రేయర్" మార్కెట్‌లో లభించే 'పవర్ స్ప్రేయర్'తో దాదాపు సమానమైన వత్తిడితో మందును పిచికారి చేస్తుంది. ఈ స్ప్రేయర్‌ను ఉపయోగించుకోవాలనుకున్న ముందు రోజు రాత్రి కరెంటుతో ఛార్జింగ్ పెట్టుకుంటే 6 గంటలకు పైగా పొలంలో మందును పిచికారి చేసుకోవచ్చు. ఇంకా ఎక్కువ సమయం స్ప్రే చేయాలనుకున్నవారు 'సోలార్ ప్యానల్'ను దీనికి తగిలిస్తే స్ప్రే చేయటంతో పాటుగా ఛార్జింగ్ అవుతూ వుంటుంది. కాబట్టి నిరంతరాయంగా ఎంతసేపైనా మందును పిచికారి చేసుకోవచ్చు.



## సుభాని సోదరుల స్ప్రేయర్లు

గుంటూరు జిల్లాకు చెందిన సుభాని సోదరులు రైతులకు అనువైన స్ప్రేయర్లను వారి అవసరానికి తగినట్లుగా చేయటం ప్రసిద్ధి పొందారు. రైతులు తాము సాగు చేస్తున్న పంట అవసరాన్ని, విస్తీర్ణాన్ని బట్టి వారికి వీలైనంత తక్కువ ఖర్చులో పొలంలో పురుగు మందులు పిచికారి చేయటానికి అవసరమైన స్ప్రేయర్లను తమ ఆలోచనతో తయారు చేసి ఇస్తారు. ఇప్పటికే వీరు తయారు చేసిన 'బూమ్ స్ప్రేయర్' ప్రసిద్ధి గాంచిన 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించుకుంది. వీరు తయారు చేసిన బూమ్ స్ప్రేయర్ తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందును పిచికారి చేస్తుంది. రైతుల వ్యయ భారాన్ని బట్టి మనుషులు నడిపే స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, సోలార్ స్ప్రేయర్లు, మోటార్ సైకిల్ అనుసంధాన స్ప్రేయర్లు, మినీ టిల్లర్‌ను ఉపయోగించి పని చేసే స్ప్రేయర్లను ఎన్నింటినో తయారు చేసి వేలాది మంది రైతులకు అందజేసి వారి మెప్పును పొందారు. వీరు తయారు చేసిన స్ప్రేయర్ల వల్ల ఎంతోమంది రైతాంగం తమ పొలాల మందు పిచికారి ఖర్చులను ఎంతో ఆదా చేసుకుంటున్నారు.



## మూడు రకాల పనులు చేసే డ్రమ్‌సీడర్

విజయనగరం జిల్లా రైతు దామరసింగి బాబూరావు తయారు చేసిన బహుళ ప్రయోజనకారి ఈ డ్రమ్ సీడర్. దీనితో రైతు పొలంలో విత్తనంతో పాటు, ఆ విత్తనంపై మట్టిని కప్పడం, ఎరువులు, పురుగు మందు లేదా కలుపు మందును ఒకేసారి వేసుకోవచ్చు. ఇలా చేయటం వల్ల రైతుకు ఎంతో సమయం, ఖర్చు ఆదా అవుతుంది. ఈ పరికరాన్ని మనుషులు లాగుతూ పని చేసుకోవచ్చు, కాడెద్దులకు కట్టి లాగిస్తూ పని చేసుకోవచ్చు, ట్రాక్టరుకు కూడా అనుసంధానం చేసుకోవచ్చు.

దీని ద్వారా వేరు శనగ నుండి నువ్వుల విత్తనం వరకు అన్ని రకాల విత్తనాలను పొలంలో విత్తుకోవచ్చు. మామూలుగా జడిగం ద్వారా వేసే విత్తనాలకన్నా సగానికి సగం విత్తనాల ఖర్చు తగ్గుతుంది. ఇన్ని రకాల బహుళ ప్రయోజనకారి ఈ డ్రమస్‌సీడర్.

---

ఈ స్ప్రేయర్లు కావలసిన వారు సంప్రదించ వలసిన చిరునామా :
'పల్లెసృజన' కార్యాలయం, 67, రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959, సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

# రైతుకు ఆదా చేయటమే పరమావధిగా
# బాబూరావు సృజనలు



మారుతున్న కాలంలో రైతుకు కూలీలు లభించటం కష్టమే కాదు, ఆ ఖర్చు కూడా విపరీతమైన భారంగా మారుతోంది. గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన “ఉపాధి హామీ పథకం’ కూలీల సమస్యను మరింత క్లిష్టతరం చేసింది అనటం యావత్ రైతాంగాన్ని కృంగదీస్తున్నది. దానితో పాటు సాంప్రదాయ రైతువారి విత్తనాలు కరువైపోయి, ప్రతి రైతు విత్తనాలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందే అన్న స్థితికి రావటంతో ఆ ఖర్చు కూడా తడిసి మోపెడవుతోంది. ఈ రెండింటి ఖర్చులను తగ్గించ గలిగితే రైతుకు కొంత ఊరట ఇచ్చినట్లవుతుందన్న సంకల్పంతో విజయనగరం జిల్లా, పార్వతీపురం గ్రామానికి చెందిన రైతు, మెకానిక్ ‘దామరసింగి బాబూరావు’ రైతుల కొరకు కొన్ని సృజనలను సృష్టించాడు. గతంలో నాలుగు రకాల పనులు చేసే డ్రమ్ సీడర్ ద్వారా పరిచయమైన బాబూరావు పల్లెసృజన పాఠకులకు గుర్తుండే వుంటారు. ప్రస్తుతం బాబూరావు రైతుల కొరకు తయారు చేసిన మరికొన్ని వినూత్న ఇన్నోవేషన్‌లను మీకు అందిస్తున్నాం.

**చెఱకు నాటే పరికరం :**

మామూలుగా రైతులు వారికి తెలిసిన విజ్ఞుల సలహాల ప్రకారం సాలుకు సాలుకు మధ్య వెడల్పును ఏర్పాటు చేసుకుని మొక్కల మధ్య దూరాన్ని పాటించకుండా చెఱకు నాటుకుంటూ వుంటారు. ఈ పద్ధతి వల్ల విత్తటానికి ఎక్కువ చెఱకు ఖర్చవటంతో పాటు, మొక్కల మధ్య సరియైన గాలి రాకపోవటంతో దిగుబడి కూడా అంతంత మాత్రంగానే వస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా బాబూరావు ఒక చట్రాన్ని తయారు చేశాడు.

ఈ చట్రం కేవలం 15 కిలోల బరువుంటుంది. ఇద్దరు మనషులు ఈ చట్రాన్ని పొలంలో జరుపుకుంటూ దానికున్న చెఱకు నాటే గుర్తుల వద్ద చెఱకు నాటి, ఆ చట్రానికే అమర్చిన ‘గమాక్సిన్’ సంచిని చేతితో కదపడం చేయాల్సి వుంటుంది. దీనివల్ల అనేక విధాలుగా రైతుకు లాభం చేకూరుతుంది.

మొదటిది విత్తనం ఖర్చు. సాధారణంగా కూలీలతో చెఱకు నాటిస్తే ఎకరాకు 5–6 టన్నులు అవసరమైతే ఈ పరికరంతో నాటడం వల్ల కేవలం ఒక్క టన్ను చెఱకు మాత్రమే సరిపోతుంది. నాటడానికి 20 నుండి 30 మంది కూలీలు అవసరమైతే ఈ పరికరం కేవలం 3 లేదా 5 మందితో పనైపోతుంది. 180 రోజుల వరకు చెఱకు

**కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.**

మధ్యలో కూరగాయలు, అపరాలు, మినుములు లాంటి అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. దీనివల్ల రైతుకు అదనపు ఆదాయం వస్తుంది. ఇక ముఖ్యమైనది దిగుబడి.... మామూలుగా నాటిన చెఱకులో మొదటి సంవత్సరం 20 టన్నుల దిగుబడి వస్తే, రెండో సంవత్సరం 40 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ పంటను ఒకసారి నాటితే రెండు లేదా మూడు సంవత్సరాల వరకు మాత్రమే పంట తీసుకోగలము.

ఈ పరికరంతో నాటిన పంట మొదటి సంవత్సరం ఎకరాకు 35–40 టన్నుల వరకు, రెండో సంవత్సరం 60–70 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశముందని, ఈ పరికరంతో నాటడం వల్ల చెఱకు గాలులకు క్రింద పడిపోయే అవకాశాలు చాలా తక్కువని విజయనగరం ప్రాంతంలోని చక్కెర కర్మాగారాలు, వ్యవసాయ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ పరికరం ద్వారా రైతుకు కూలీల ఖర్చు మిగలటంతో పాటు, అధిక దిగుబడి, అంతర పంటల ద్వారా అధిక ఆదాయం సమకూరుతుంది.





**జీవామృతం మొక్కలకు అందించే పరికరం :**

ప్రస్తుతం రైతాంగం సేంద్రియ వ్యవసాయం వైపుకు అడుగులు వేస్తున్న విషయం అందరికీ విదితమే. ఇంకా అనుకున్నంత వేగంగా ఈ సేంద్రియ వ్యవసాయం అభివృద్ధి లోకి రాకపోవటానికి ప్రధాన కారణం కూడా కూలీల సమస్యే అన్నది ప్రతి రైతుకు తెలుసు. ఈ సేంద్రియ పద్ధతిలో ప్రధానంగా మొక్కల మొదళ్ళవద్ద, మొక్కలపైన జీవామృతం చల్లటం ఒక ప్రధానమైన పని. దీనికి ఎంతోమంది కూలీల అవసరం, శ్రమ ఉంటుంది. పొలంలో అక్కడక్కడా జీవామృతం నింపిన డ్రమ్ములను ఏర్పాటు చేసుకుని, కూలీలు ఒక బకెట్లో దాన్ని నింపుకుని వచ్చి ప్రతి మొక్క దగ్గర జీవామృతం పోయడం లేదా మొక్కపై చిలకరించడం ప్రస్తుతం జరుగుతున్న పని. దీనివల్ల విపరీతమైన కూలీల ఖర్చు, పొలాన్ని బట్టి ఆ పొలలో డ్రమ్ములను ఏర్పాటు చేసుకోవటం ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని.

బాబూరావు తయారు చేసిన ఈ యంత్రం ద్వారా పై పనులన్నిటినీ ఎంతో పొదుపుగా, శ్రమ లేకుండా చేసుకోవచ్చు. డ్రమ్ములో జీవామృతం తేరుకుంటుందేమో అన్న అనుమానం అవసరం లేదు. ఎందుకంటే ఈ యంత్రమే డ్రమ్ములోని నీటిని చిలుకుతూ వుంటుంది కాబట్టి సారవంతమైన జీవామృతం మొక్కలకు అందుతుంది. ఇద్దరుఅ లేదా ముగ్గురు కూలీలతోనే జీవామృతం వితరణ జరుగుతుంది.

బాబూరావు పరికరాలు కావలసిన వారు సంప్రదించవలసిన చిరునామా : **'పల్లెసృజన' కార్యాలయం, 67, రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094. ఫోన్ : 040–27111959, సెల్ : 96528 01700.**

**మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.**





### జాతీయ స్థాయిలో 'సృష్టి సమ్మాన్' పురస్కార గ్రహీత

# ఒక 'అమ్మ' కథ (వెనిగండ్ల పద్మజ)

- జె. శశిమోహన్

ప్రపంచంలో 'సమాజసేవ' చాలామంది చేస్తూనే వున్నారు. కొందరు సంపాదించాల్సినదంతా సంపాదించేసి ఇక విసుగు పుట్టి కొంత సమాజం వంక చూద్దాం అనుకునే వారు. జీవిత చరమాంకం వరకు ఉరుకులు, పరుగులతో గడిపి చివరి దశలో సమాజానికి ఏదో చెయ్యాలని స్పృహ వచ్చినవారు మరి కొందరు. తమ కోసం చాలా చేసుకుని, ఇంకా ఏం చేయాలో తెలియని స్థితిలో సమాజ సేవ చేయాలనుకునే వారు ఇంకొందరు. వీరు కాక మన ఎదుగుదలకి సమాజం కూడా కారణం కనుక దానికీ కొంత సేవ చేయాలనుకునే వారు, మనమూ సమాజంలో భాగం కనుక దానిపట్ల మనకీ బాధ్యత ఉంది అని అనుకునే వాళ్ళు, సమాజం బాగుంటే నేను బాగుంటాను అనుకునే వాళ్ళు. ఇటువంటి వాళ్ళలో ముందు వరుసలో ఉన్న ఉత్తమురాలు 'అమ్మ' అని పిలువబడుతున్న 'వెనిగళ్ళ పద్మజ'.

మొదటిసారి చూసే వారికి ఆమె ఒక సాధ్విలా కనిపిస్తుంది. కనిపించడమే కాదు, ఆమె నిజంగా 'సాధ్వే'. తల నీలాలు లేకుండా, తెల్లచీర కట్టుకుని, ప్రశాంతంగా కనిపించే ముఖ వర్చస్సు, స్వాంతన కలిగించే చూపులు, ప్రోత్సాహాన్నిచ్చే మాటలు, చెరగని చెరునవ్వు ఆమె సొంతం. తమ ఆశ్రమ వాసులకి చుట్టు ప్రక్క వ్యక్తులకి ఆమె 'అమ్మ'. కష్టాల్లో అక్కున చేర్చుకునే అమ్మ. బాగా పరిచయమున్న వాళ్ళకి, ఆత్మీయులకి ఆమె 'తల్లి'. అవును చిన్న పిల్లలకి, పెద్దవాళ్ళకి, ముసలి వాళ్ళకి కూడా మాతృమూర్తి మమకారాన్ని పంచి, కన్నతల్లికన్నా ఎక్కువగా లాలించి పాలించే తల్లి ఆమె.

అమ్మ పద్మజ గారి సామాజిక సేవా చార్యక్రమాలు చాలామందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. ఆమె 'సోదరి', 'నివేదిత' సేవా సంస్థల సంస్థాపకురాలు. ఆమె 'శ్రీరంజని కళా క్షేత్రం' సంస్థాపకురాలే కాక, ప్రధాన పోషకురాలిగా ఉంటున్నారు. 'జట్టు ఆశ్రమం'లో కార్యశీల ట్రస్టీగా వ్యవహరిస్తున్నారు. ఆమె అనాథలు, సమాజంలోని ఒంటరి మహిళలకు ఆశ్రయం కల్పించడానికి ఆశ్రమాలు

**అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.**




నడుపుతున్నారు. అలాంటి ఒక ఆశ్రమం ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లా 'పార్వతీపురం'లో ఉండగా, ఇంకొకటి ప్రకాశం జిల్లా 'అద్దంకి'లో ఉంది. ఈ ఆశ్రమాలు క్రమేణా పిల్లలు, యువకుల అభివృద్ధి కేంద్రాలుగా కూడా రూపు దిద్దుకుంటున్నాయి.

పద్మజ గారు అమ్మగా రూపాంతరం చెందటానికి చాలా బలీయమైన సంఘటనలు జరిగిన క్రమంలో ఆమె వివాహమే చేసుకోకూడదని నిశ్చయించుకుని, దళిత, పీడిత, తాడిత ప్రజల కోసం తన జీవితాన్నే అంకితం చేసుకుంది.

ఆమె 9 ఏప్రిల్, 1971లో కర్నాటక లోని రాయచూర్ జిల్లాలో జన్మించింది. తల్లిదండ్రులు శ్రీ వెనిగెల భూమేశ్వర రావు, శ్రీమతి లలిత గార్లు. తన ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో, తర్వాత ప్రకాశం జిల్లాలోని ఒక ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. కర్నాటక లోని ధార్వాడ్ విశ్వ విద్యాలయంలో బి.ఎస్‌సి. చదివి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను 'ఎంటమాలజీ'లో పూర్తి చేశారు. డిగ్రీ చదివే రోజుల్లోనే ఆమె స్వచ్ఛంద సంస్థల్లో స్వచ్ఛంద కార్యకర్తగా సేవలందించటం ప్రారంభించారు. చదువు పూర్తయిన తర్వాత 4 సంవత్సరాలు 'లాష్ ఇంటర్నేషనల్ సంస్థ'లో దివ్యాంగులకి సేవ చేస్తూ గడిపారు. అక్కడ ఆమె జీవితం గురించి చాలా విషయాలు అవగాహన చేసుకున్నాను అంటారు. తర్వాత ఆమె ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిగా ఉద్యోగంలో చేరారు. ఆమెకు వివాహం చేద్దామని తల్లిదండ్రులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమె తిరస్కరించింది. తన జీవితం తోటి ప్రజల కష్టాలు తీర్చడానికే అంకితం చేయాలని నిర్ణయించుకున్నానని స్పష్టంగా చెప్పేసింది. తన ఈ భీష్మ ప్రతిజ్ఞ నిర్ణయానికి కారణం చెపుతూ ఆమె 'తన అమ్మమ్మ గారి ఇంట్లో ఉంటూ ఉన్నత పాఠశాల విద్యను భ్యసిస్తూ వుండగా, తన మేనమామ తనను మానసికంగా, శారీరకంగా చాలా ఇబ్బందుల పాలు చేశాడని, ఇది చెప్పినా ఎవరూ నమ్మరని, ఎవరికీ చెప్పకుండా తనలో చనే బాధ పడ్డానని, ఆ బాధలోంచే తనకొక గమ్యం గోచరించిందని, దాన్నే తాను అవలంభిస్తున్నానని, దాన్నే తన జీవిత పరమావధిగా చేసుకున్నా'నని చెప్తారావిడ. ఎవరు ఎన్నిసార్లు ప్రయత్నించినా పెళ్ళి చేసుకోలేదు. తన వేషమే మార్చేసింది. తల నీలాలు తీసేసి, తెల్లని వస్త్రాలు ధరించడం ప్రారంభించి 'సాధ్వి' గా మారిపోయింది. ప్రజల సేవకే జీవితాన్ని అంకితం చేసింది. స్త్రీ సహజమైన కోరిక 'తల్లి' అవ్వాలని లేదా? అని అడిగితే తల్లి అవ్వాలంటే పిల్లల్నే కనఖ్కర్లేదని ఒక పాపను దత్తత తీసుకుంది. ఆ కాలంలో తను 'ఓప్రా విన్‌ఫ్రే' కార్యక్రమాలు చూసి చాలా ప్రభావితం అయ్యానని, ఆమె కూడా చిన్నతనంలో లైంఘికంగా వేధింప బడినదే అని, అయినా ప్రపంచ ప్రఖ్యాత టీవీ కార్యక్రమాలకి హోస్ట్‌గా పని చేస్తోందని, ఆమెనే తాను స్పూర్తిగా తీసుకుని, జీవితంలో ఎవ్వరూ అనాథలుగా, దగాపడ్డ స్త్రీలుగా ఉన్నా, వారికి చేయూతను ఇవ్వాలని నిశ్చయించుకొని అనేక కార్యక్రమాలు తాను స్థాపించిన ఆశ్రమాల ద్వారా చేస్తున్నాని చెప్పారు అమ్మ.

ఒకసారి ఆమె జిల్లా కలెక్టరు గారి ద్వారా 'జట్టు' ఆశ్రమాలు నడిపే 'శ్రీ డొల్లు ఎ.వి. పరినాయుడు' గారిని కలవటం తటస్థించిందని, ఆయన ఆలోచనా సరళి, కార్యదీక్ష తనకి బాగా నచ్చిందని, అందుకే చేస్తున్న ఉద్యోగం కూడా మానేసి 2004లో ఆశ్రమ కార్యకలాపాలలో చేరి అనాథ బాల బాలికలకి వారి అభిరుచి వున్న విద్య, కళలలో ప్రోత్సాహం అందించి, వారి కాళ్ళమీద వారే నిలబడేలా చేసే బృహత్ కార్యక్రమాన్ని ఒక తపస్సులా, దీక్షతో నిర్వహించి, కొనసాగిస్తున్నారామె.

జట్టు ఆశ్రమంలో ఉన్నప్పుడు ఆమె చిన్న పిల్లలలో

**నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.**

నాట్యం పట్ల ఉత్సాహం ఉండటం గమనించారు. వారికి కొంచెం శిక్షణ ఇస్తే వారిలో నిద్రాణమైవున్న ప్రతిభను వెలుగులోకి తీసుకు రావచ్చునని తలచి ఆమె కొందరు నిష్ణాతులైన నాట్యకారులు, స్వచ్ఛంద కార్యకర్తల సహాయం తో ఆ చిన్న పిల్లలకి శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్పించింది. ఇలా కొన్ని వందల మందికి శిక్షణ ఇప్పించారావిడ. కేవలం శిక్షణే కాదు, వారిచేత ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ లాంటి నగరాలలోనే కాక, విదేశాలలో కూడా ప్రదర్శనలు ఇప్పించే స్థాయికి తీసుకువెళ్ళి ప్రశంసలు అందుకునేలా చేశారు. అంతేకాక, ఆమె మగపిల్లలకి కర్రసాము, విలువిద్య, స్థానిక సాంప్రదాయ విద్యలలో కూడా శిక్షణ ఇప్పిస్తున్నారు.

ఆమె చేసిన ఒక నూతన ప్రయోగం చాలా విజయ వంతంగా మంచి ఫలితాలను ఇస్తోంది. పిల్లలకై స్థాపించిన ఆశ్రమంలో వృద్ధ స్త్రీలకు స్థానం కల్పించింది. దీనితో పెద్దలకి పిల్లలతో కాలక్షేపం అవటమే కాకుండా, పెద్దల దగ్గరనుంచి పిల్లలు వారి అనుభవ సారాన్ని గ్రహించి జ్ఞాన సంపన్నులవుతూ, అనురాగ ఆప్యాతలను పొందుతు న్నారు.

అమ్మ ఆధ్వర్యంలో నడిచే ఆశ్రమాలలో సుమారు 72 మంది అనాథ బాల బాలికలకి ఆశ్రయం ఇచ్చారు. ఆమె నాట్య శిక్షణా కార్యక్రమాలలో సుమారు 11 వందల మంది శిక్షణ పొందగా, వారిలో దాదాపు 200 మంది నిష్ణాతులుగా తయారై, ఇతరులకి చెప్పే స్థాయికి ఎదిగారు. 33 మంది వృద్ధాశ్రమంలో ఉండి తమ జీవిత చరమాంకంలో ప్రశాంతమైన జీవితం గడిపారు, గడుపుతున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి దాదాపు 50 మంది పిల్లలు





స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కార్యకర్తల సహాయంతో విలువిద్య, కర్రసాము, ఇతర కళలలో శిక్షణ ఇప్పిస్తున్నారు. మూడు మండలాలలోని 45 పాఠశాలల్లో పిల్లల సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, పుస్తక పఠనంలో అభిలాష పెంచటానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'అద్దంకి' ఆశ్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాలలోని పూర్తి అనాథలు, తల్లి కాని, తండ్రి కాని లేని పాక్షిక అనాథలు, ఒంటరి మహిళలకి నైపుణ్యం పెంచే క్రమంలో వృత్తి శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. 30 మంది మహిళలు వివిధ వృత్తులలో శిక్షణ పొంది, తామే స్వంతంగా జీవనోపాధి సాగిస్తున్నారు. జట్టు ఆశ్రమంలో 42 మంది అనాథలు చదువుకుంటున్నారు......

ఇలా ఎంతోమంది అనాథలకి, దగాపడ్డ మహిళలకి జీవితంపై మక్కువ కలిగించి, జీవనోపాధి కలిగిస్తున్నది అమ్మ పద్మజ.

అమ్మ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలను గుర్తించిన 'పల్లెసృజన' తమ మాతృసంస్థ అయిన 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్'కు సిఫారసు చేసి పద్మజ గారికి 2017 సంవత్సరానికి గాను 'సృష్టి సమ్మాన' పురస్కారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో జాతీయ స్థాయిలో ఘనంగా సత్కరించడం జరిగింది.

తెలిసిన వాళ్ళంతా పద్మజ గారిని 'అమ్మ' అని ఆప్యాయంగా, హృదయాంతరాళలోనుండి మనస్ఫూర్తిగా పిలుచుకోవటంలో ఆశ్చర్యమేమీ లేదు. ●

**మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.**

# 'పల్లెసృజన' తీపి జ్ఞాపకాలతో జీవనయాత్ర ముగించిన ఈశ్వరమ్మ



ఆంధ్రప్రదేశ్, కడప జిల్లాలో గత 24-26 జూన్, 2016 తేదీల్లో జరిగిన 19వ చిన్న శోధయాత్ర వి.ఎన్. రెడ్డి పల్లె నుండి గంగారెడ్డిపల్లె గ్రామాల మధ్య జరిగింది. 'పల్లెసృజన' ప్రతి శోధయాత్రలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో వయో వృద్ధుల జ్ఞానాన్ని సేకరించి, కృతజ్ఞతాభావంతో వారిని శాలువాతో సత్కరించడం రివాజుగా జరుగుతున్నది. ఈ క్రమంలో 'బుసిరెడ్డిపల్లె' గ్రామంలోని వయోవృద్ధురాలైన శ్రీమతి ఈశ్వరమ్మ గారిని కూడా పల్లెసృజన పలుకరించి, వారి జ్ఞానానికి ముగ్ధులై గౌరవంగా శాలువాతో సన్మానించడం జరిగింది. ఇది ఆ గ్రామస్తులకు ఉద్వేగభరితమైన ఆనందానికి గురి చేసిందన్న విషయం యాత్రీకులకు అప్పటివరకు తెలియదు.

ఈ సత్కారం జరిగిన తర్వాత ఆ వృద్ధురాలు ఈశ్వరమ్మ తనకు ఎవరు తారసపడ్డా తనకు 'పల్లెసృజన' చేసిన సత్కారాన్ని వివరించి, తనకు కప్పిన శాలువను చూపిస్తూ ఎంతో ఆనందానికి గురయ్యేదట. అంతే కాదు ఆ శాలువాను ఎల్లప్పుడూ తన తలగడ క్రిందనే ఉంచుకని నిద్రించేదట కూడా !

ఈమధ్య ఆమెకు ఆరోగ్యం బాగా క్షీణించి చివరకు శరీరాన్ని వదిలిపెట్టడం జరిగింది. ఆమె కాలధర్మం చేసేముందు తన వారసులతో "నా అంతిమ సంస్కారం చేయటానికి వేరే గుడ్డను ఉపయోగించకండి, 'పల్లెసృజన' వారు నాకు కప్పిన శాలువాతోనే నా సంస్కారాలను నిర్వహించండి" అని మరీ మరీ చెప్పిందట.

ఆమె స్వర్గస్తురాలైన తర్వాత గ్రామ ప్రజలు ఆమె చివరి మాటలను మననం చేసుకుని, ఈమెను ఇంతగా ప్రభావితం చేసిన 'పల్లెసృజన'ను తలుచుకొని ఎంతో సంతోషించారట. చివరకు ఆమె కోరుకున్నట్లుగా ఈశ్వరమ్మగారి అంతిమ సంస్కారాలను ఆ శాలువతోనే నిర్వహించడం జరిగిందట!! పల్లెసృజన చేస్తున్న చిన్న సత్కారాలకు వారి మనసుల్లో ఇంతటి చెరగని ముద్ర వేస్తాయని, వారిని ఇంతగా ప్రభావితం చేస్తాయని తెలుసుకున్న మాకు చాలా ఆనంద వేసిది.

పల్లెసృజన నమ్మినట్లు "ఒక వయోవృద్ధుడు/రాలు మరణిస్తే ఒక గ్రంథాలయం కాలిపోయినట్లే" అన్న అభిప్రాయం సరియైనదేనని భావించి ఇలాంటి వయోవృద్ధులను సత్కరించే కార్యక్రమాలను భవిష్యత్తులో ఇంకా మనస్ఫూర్తిగా చేయాలని నిశ్చయించుకుంది.

ఆమె ఆత్మశాంతించాలని మనసారా కోరుకుంటూ పల్లెసృజన కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా గ్రామీణ ప్రజలను మానసికంగా ఆకర్షిస్తాయని ఆశిస్తూ వారి ఆత్మీయతకు మనసారా కృతజ్ఞతలు. **– పల్లెసృజన బృందం.**

**నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.**

## తెలంగాణ రాష్ట్రంలోని 'నిర్మల్ జిల్లా'లో

# 23వ చిన్న శోధయాత్ర

### 2-4 జూన్, 2017 తేదీలలో



- జమ్మలమడక శశిమోహన్

నిర్మల్‌లోని వాసవీ స్కూలు ప్రాంగణం నుంచి ప్రారంభమైంది 23వ చిన్న శోధయాత్ర. స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయులు ఈ యాత్ర ప్రణాళిక చేయడంలో ఎంతో సహాయం అందించారు. ముఖ్యంగా ప్రశాంత్, రామదాసు, ముత్యంరెడ్డి గార్ల ప్రయాస యాత్ర సఫలీకృతమవడానికి తోడ్పడింది. ఇరవైరెండుమంది యాత్రీకులతో ప్రారంభమైన యాత్ర మొదట పరిచయాలతో మొదలైంది. ఆ తర్వాత యాత్ర ఎలా చేయాలి, ముఖ్య ఉద్దేశ్యాలు, భోజన, వసతి సదుపాయాల గురించి అందరికీ అవగతం చేయడం జరిగింది. దగ్గరేవున్న చాలా పెద్ద మర్రిచెట్టు యాత్రలో ప్రథమంగా కనిపించిన ఆకర్షణ. యాత్రీకులు చాలాసేపు ఆ చెట్టు గురించి చర్చించుకున్నారు.

శోధయాత్ర గ్రామం చేరుకోగానే అక్కడ గ్రామ మధ్యలో ఇన్నోవేషన్లు, పోస్టర్లు కట్టారు. గత యాత్రల మాధ్యమంగా సంకరించిన పల్లె జ్ఞానాన్ని ఈ గ్రామస్తులతో పంచుకున్నారు. సమస్యలు ఎలా వచ్చాయి? వాటికి పరిష్కారాలు గ్రామస్తులే ఎలా వెతక గలరు, వాటివల్ల రైతులకు గ్రామస్తులకు చేకూరిన లాభాలు కష్ట, నష్ట నివారణలు అన్నీ వివరింగా శోధయాత్రీకులు చెప్పారు. మల్లేష్ సోలార్ స్ప్రేయర్‌ను రైతులందరు చూశారు. కొందరు సిమెంటు ఎలక్ట్రిక్ స్తంభాలను తిరుపతిరావు పరికరంతో ఎక్కి ఆనందించారు. పిల్లలకు వీడియోలు చూపించి, వారి ఐడియాలను సేకరించారు. ఇలా ప్రతి గ్రామంలో మహిళలతో, రైతులతో, పిల్లలతో శోధయాత్రీకులు సంభాషించి, వారి జ్ఞానాన్ని, వారి క్రియాశీలతను సేకరించే ప్రయత్నం ఈ శోధయాత్రల్లో జరుగుతుంది.

మొదటిరోజు ముఠాపూర్ గ్రామంలో ప్రజలతో ఇన్నోవేషన్ల గురించి వివరించిన తర్వాత 'పోసులు' అనే ఒక ఎలక్ట్రిక్ లైన్‌మెన్ తాను తన రక్షణకై తయారు చేసుకున్న పరికరాన్ని శోధయాత్రీకులకు చూపించాడు. 11 కిలోవాట్ల

ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.



విద్యుత్ స్తంభాలపై ఎక్కినపుడు ఆ వైర్లలో కరెంటు సరఫరా ఉందన్న విషయం లైన్‌మెన్‌కు సరిగ్గా తెలియదు. సరఫరాను సబ్‌స్టేషన్ వద్ద నిలిపివేసే వరకు ఊరి ప్రజలు ఊరుకోరు. ఈ ఇబ్బందులనుండి విముక్తికై 'పోసులు' చిన్న 'అర్తింగ్ పరికరం' ఎంతో సులభంగా తయారు చేసుకున్నాడు. ఆయన తన జీవితాన్నే ఫణంగా పెట్టి దీన్ని పరీక్షించడం జరిగింది. ఈ పరికరంతో ఏ విద్యుత్తు స్తంభాన్నయినా ఎక్కడానికి వీలుగా ఉంటుంది. దీంతో సమయం వృధా కాకుండా విద్యుత్తు లభించడమే కాకుండా, లైన్‌మెన్‌లను ప్రమాదాల నుండి పూర్తిగా రక్షిస్తుంది. పోసులు తయారు చేసిన ఈ అద్భుత ఇన్నోవేషన్‌ను చూసి శోధయాత్రీకులు అబ్బురపోయారు. ఆయన్ను శాలువాతో కప్పి, సత్కరించారు. ముత్తాపూర్ గ్రామస్తులు ఆ ఇన్నోవేషన్‌ను గురించి వారికి ఇంతవరకు తెలియదని చెప్పడం కొసమెరుపు. అంటే గ్రామాల్లో వ్యక్తులు వారి అవసరాల కొరకు తయారు చేసుకున్న ఇన్నోవేషన్లు, తోటి గ్రామస్తులకు కూడా తెలియకుండా పోతున్నాయి. ఇలాంటి వాటిని అందరికీ తెలియజేయటమే లక్ష్యంగా పని చేస్తోంది 'పల్లెసృజన' అని గ్రామస్తులకు తెలియజేశారు యాత్రీకులు.

తిమ్మాపూర్ గ్రామస్తులతో సంభాషణల్లో తెలిసిందేమిటంటే ఈ ప్రాంతం వర్షాధారం కాబట్టి ప్రధానంగా వరి, మొక్కజొన్న, పసుపు పంటలు పండిస్తారు. పసుపు రైతులతో చర్చల్లో తెలిసిందేమిటంటే పసుపు కొమ్ములను భూమిలోంచి తీసిన తర్వాత వాటిని ఉడకబెట్టి, పసుపు ఉపయోగానికి అనువుగా తయారుచేసి మార్కెట్‌కు తరలిస్తారు. ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. పసుపు ఉడకబెట్టడానికి అవసరమైన కట్టెలు, వాటికయ్యే కూలీలు చాలా ఖర్చుతో కూడుకున్న పని. పల్లెసృజన వారికి మణిపూర్ రాష్ట్రంలోని చుర్‌చాంద్‌పూర్ జిల్లాలో రైతులు పసుపు చేసే విధానం గురించి తెలియజేశారు. అక్కడ పసుపు కొమ్ములను ఉడకబెట్టకుండా బాగా కడిగి ఎండలో పెడతారు. బెరడు ఎండిన తర్వాత వాటిని సన్న పాయలుగా కోసి, నీడలో ఆరబెడతారు. కరకరగా ఎండిన తర్వాత వాటిని గ్రైండర్‌లో పసుపుగా మార్చి ఆ పసుపును రైతులు మార్కెట్‌కు తరలిస్తారు. గ్రామాల్లో కూడా పసుపును వాడుకోవచ్చు. ఈ విధానాన్ని విని, కొందరు రైతులు ఈ ప్రయోగాన్ని ఈ సంవత్సరం అమలు చేస్తామని తెలియజేయడంతో ఎక్కడో మణిపోర్‌లోని జ్ఞానాన్ని తెలంగాణ లోని నిర్మల్‌లోకి ప్రసారం చేసినట్లవటంతో యాత్రీకులకు కూడా 'సమానాంతర జ్ఞాన ప్రసరణ' (పల్లెనుంచి పల్లెకి) అంటే ఏమిటో తెలిసింది.

మామడ గ్రామంలో రైతులతో గ్రామస్తులు ఇన్నోవేషన్ల గురించి తెలియజేస్తుంటే మేము కూడా చాలా పరికరాలు చేశామని చెప్పారు. గత 20 యేళ్ళుగా ఆ ప్రాంతంలో కలుపు తీయడానికి, బోదెలు చేయడానికి, పశువులతో గాని, మనుషులతో గాని నడిచే సులభమైన పరికరాలు తయారు చేసుకుని వాడుకుంటున్నారు. కొన్ని స్థానికంగా దొరికే కట్టెలతో, మరికొన్ని సైకిలు చక్రం, ఇనుప కడ్డీలతో తయారు చేసినవి శోధయాత్రీకులకు చూపించారు.



**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

ఇన్నేళ్ళుగా ఈ ప్రాంతంలో ఇలాంటి ఇన్నోవేషన్లు విరివిగా వాడుతున్నారన్న విషయం సమాజానికి తెలియదు. మా ఇరవైరెండు యాత్రల్లో ఇలాంటి క్రియాశీలత ఏ గ్రామంలోనూ కనిపించలేదు.

పిచారాగ్రామంలో చనిపోయిన పశువులను ఏం చేస్తారని అడిగాం. వెంటనే వారు డెబ్బయ్యేళ్ళ వృద్ధున్ని శోధయాత్రీకులకు పరిచయం చేశారు. ఆయన తనూ, తన కుటుంబ సభ్యులు పశు కళేబరాల నుండి చర్మాన్ని తీసి, ఎలా శుభ్రం చేస్తారో వివరించారు. చర్మాన్ని శుభ్రం చేయడానికి రాలెచెట్టు బెరడును, రసాన్ని వాడేవారట. చర్మం ఎంతో నున్నగా, శుభ్రంగా తయారయ్యేది అన్నారాయన. శుభ్రం చేయడానికి వాడిన ద్రావణం వాతావరణానికి హానికరం కూడా కాదని వక్కాణించారు. శోధయాత్రీకులు ఈ సంప్రదాయ చర్మశుద్ధి పద్ధతిని తెలుసుకొని ఆనందించారు. ఏ కాలుష్యం లేకుండా, కళేబరాల నుండి గ్రామస్తులకు చెప్పులు, వ్యవసాయానికి కావలసిన పశువుల మెడలోని గంటల బెల్టులు, చెర్న కోలలు, ఎద్దులకు అలంకరణ సామాగ్రి తయారు చేస్తారు. అంతే కాదు, లేత దూడల చర్మాలను డప్పులకు ఉపయోగిస్తారు. ఇలా అన్నీ గ్రామంలోనే తయారు చేసేవారు. గ్రామ స్వయం సమృద్ధికి, వాతావరణ పరిరక్షణకు తోడు చేసే ఇంతటి ఉత్తమమైన జీవనోపాధిని మనం ఎలా పోగొట్టుకున్నామని వాపోయారు. గంగన్న గారు ఇప్పుడు ఈ పద్ధతిని అవలంభించటం లేదు. ఆయన సంతానం కూడా ఈ వృత్తిని వదిలేసారు. ఈ విధంగా 'పిచారా' గ్రామాల్లాంటి లక్షల గ్రామాలు దేశంలో అద్భుత కళను, వృత్తిని పోగొట్టుకున్నాయి.





లక్ష్మణచందా గ్రామం దాటి నడుస్తుంటే రోడ్డు ప్రక్కనున్న ఒక పొలంలో యువకుడు పని చేస్తూ కనిపించాడు. ఈ కాలంలో 30 ఏళ్ళకన్న తక్కువ వయసున్న వాళ్ళు వ్యవసాయం చేయటం కనిపించడం అరుదు. అందుకే ఆ యువకుడి వద్దకి శోధయాత్రీకులు చేరుకున్నారు. 'ప్రభాకర్' అనే 24 యేళ్ళ అతను గత పది సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాడు. చిన్నతనంలో తల్లిదండ్రులు పోవటంతో తానే ఇంటి పెద్ద ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేశాడు. తన నాలుగెకరాలే కాకుండా మరో పది ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అదనంగా సాగు చేస్తున్నాడు. అతను నవ్వుతూ తన కష్టాలను, నష్టాలను యాత్రీకులకు వివరించాడు. ఏదియేమైనా తాను ఊరు వదిలి వెళ్ళనని వక్కాణించాడు. గత అయిదు సంవత్సరాల్లో వ్యవసాయంలో ఎన్నో ఒడిదుడుకులు కలిగాయని, మూడు సంవత్సరాలు లాభం వస్తే రెండు సంవత్సరాలు చాలా నష్టాలు వస్తున్నాయని చెప్తూ, తాను నిరాశ పడటం లేదని, వ్యవసాయాన్ని కొనసాగిస్తానని ధైర్యంగా చెప్పాడు. తనకు వ్యవసాయంలో వచ్చే సంశయాలకు జవాబు ఇచ్చేవాళ్ళు అందుబాటులో లేరని అలా ఒక వ్యవస్థ ఉంటే బాగుంటుందని సలహా ఇచ్చాడు. ప్రభాకర్ కథ విని చిన్న వయసులోనే ఆయనకున్న సదుద్దేశ్యాలను, గ్రామంలోనే ఉండాలన్న నిర్ణయాన్ని, ఆయన ధైర్య స్థైర్యాలను చూసి ఎంతో దిగ్భ్రాంతి చెందారు యాత్రీకులు. ఇలాంటి యువకులు పట్టణాల్లో కనిపించరని అనుకున్నారు.

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**

ప్రభాకర్‌కు 'పల్లెసృజన' తోడుగా ఉండాలని కోరారు. అతన్ని శాలువా కప్పి సత్కరించారు శోధయాత్రీకులు. తన జీవిత అనుభవాలను పంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మూడు రోజుల యాత్రలో గ్రామాల్లోని 90 ఏళ్ళ వయోవృద్ధులను వెతికి, వారి ఇంటికి వెళ్ళి శోధయాత్రీకులు వారితో సంభాషిస్తారు. వారి జీవిత విధానం ఎలా ఉండేది, వృత్తులు, అన్న పానీయాలు, పెళ్ళిళ్లు, ప్రసూతులు, వైద్యం, పశువైద్యం లాంటివన్నీ వాళ్ళ యవ్వనంలో ఎలా ఉండేదో శోధయాత్రీకులు తెలుసుకుంటారు. 90 ఏళ్ళ గతంలోని జ్ఞానాన్ని పంచుకున్నందుకు శోధయాత్రీకులు ఆ జ్ఞాన వృద్ధుల్ని శాలువాతో సత్కరించి, వారి ఆశీర్వాదాలు పొందుతారు. ఈ యాత్రలో కూడా ఒక పురుష వృద్ధుడిని, ఇద్దరు మహిళా వృద్ధురాళ్ళను ముఖాముఖి కలుసుకుని వారితో చర్చించి, వారిని సత్కరించడం జరిగింది. అదృష్ట శాత్తు మూడు రోజుల్లో ముగ్గురు వృద్ధులతో పరిచయం జరగటం గమనార్హం. ఈ చర్య గౌరవింపబడిన పెద్దలకు వారి కుటుంబానికి కూడా ఎంతో సంతోషాన్నిస్తుందని పల్లెసృజన విశ్వాసం.

గ్రామాల మధ్యలో చెట్టు నీడల్లో ఏటి ఒడ్డులపైన కూర్చొని శోధయాత్రీకులు గ్రామ ఇన్నోవేటర్ల కథలను చెప్పుకున్నారు. ఇన్నోవేటర్లు అనుభవించే అడ్డంకులు, సమాజ నిర్లక్ష్యము, ఇన్నోవేషన్‌ను పదిమందికి చేరవేయడా నికి ఎదురయ్యే సమస్యలు, ఇవన్నీ కూలంకషంగా చర్చించుకున్నారు. శోధయాత్రీకుల సలహాలను, వారి చేయూతను పల్లెసృజన, పల్లెజ్ఞాన ప్రసరణకై స్వచ్ఛందంగా వాలంటీర్ల రూపంలో ఆహ్వానించింది. ఈ యాత్రలో కూడా చింతకింది మల్లేశం, పాండురంగారావు, గల్లా చంద్రశేఖర్,





మహిపాల్‌చారి, బొమ్మగాని మల్లేశ్, దామరసింగి బాబూరావు లాంటి ఇన్నోవేటర్ల కథలను శోధయాత్రీకులు విన్నారు. అల్లాడి ప్రభాకర్ స్వయంగా రెండవరోజు యాత్రలో పాల్గొని తన ఇన్నోవేషన్ల ఆవిర్భావం, అనుభవాలను యాత్రీకులతో పంచుకున్నారు.

ప్రతిరోజూ రాత్రి శోధయాత్రీకులు తాము ఆరోజు నేర్చుకున్న జ్ఞానాన్ని, చూసిన విశేషాలను అందరితో పంచుకున్నారు. ఆ గ్రామాల్లోనే వండిన భోజనాలు చేస్తూ, స్కూళ్ళలో రాత్రుళ్లు గడుపుతూ, కనీస అవసరాలతో మాత్రమే అత్యంత నిరాడంబరంగా, ఎన్నో గ్రామాల్లో వందలాది గ్రామస్తులతో సంభాషిస్తూ, ప్రకృతిని ఆస్వాదిస్తూ, ఆనందకరమైన మూడురోజులు యాత్రీకులు తెలియకుండా నే గడిపేశారు. వీడ్కోలు సమయం ఖానాపూర్ బస్‌స్టాండు. సేకరించిన జ్ఞానలగేజీతో, మరచిపోని అనుభవాలతో, యాత్రలో కొత్తగా సంపాదించుకున్న స్నేహితులకు వీడ్కోలు చెప్తూ శోధయాత్రీకుల తిరుగు ప్రయాణం ప్రారంభమైంది.

వెళ్తూ వెళ్తూ అందరు అన్నది ఒక్కటే మాట : బహిర్గత శోధయాత్ర పూర్తయింది కాని, అంతర్గత శోధయాత్ర ప్రారంభమైంది. అది ఎప్పుడూ జరుగుతూనే ఉండాలని అందరూ ఆశించారు.

**శోధయాత్రలో పాల్గొన్న కొందరు యాత్రీకుల అనుభవాలు :**

**ఆర్. సాయికిరణ్:**

శోధయాత్ర అనగానే నేను చాలా కాలం క్రితం చదివిన ఒక వాక్యం గుర్తుకొచ్చింది. 'నువ్వు కొండ ఎక్కటానికి కారణం ప్రపంచాన్ని చూడ్డానికి – ప్రపంచం నిన్ను చూస్తుందా అని కాదు' అని. నిజంగా ఈ శోధయాత్ర



లో చాలా విషయాలు తెలుసుకున్నాం. కష్టపడటం, ఓర్పు గురించి తెలుసుకున్నాను. ఎందుకంటే నా జీవితంలో ఎప్పుడూ మూడు రోజులు వరుసగా నడవలేదు. ఈ యాత్రలో గ్రామస్తులకు తెలిసిన విషయాలు, వారి జ్ఞాన సంపద చూసి ఆశ్చర్యపోయాను. ప్రకృతితో వారి జీవితం ఎలా ముడిపడి ఉందో తెలుసుకున్నాను. ప్రపంచంలో ఎక్కడైనా నిజమైన శాస్త్రవేత్తలు ఉన్నారా అంటే గ్రామాల్లోనే ఉన్నారనిపించింది. ఎందుకంటే వారికి అందుబాటులో వున్న పరికరాలతో, వాళ్ళ జీవితాలను సులభతరం చేసుకోవటానికి అవసరమైన వస్తువులు, పని ముట్లు వారే చేసుకుంటున్నారు.

యాత్ర జరిగిన మూడు రోజుల్లో నేను చూసింది ఒకయెత్తయితే, బ్రిగేడియర్ గణేశం గారు మా మేధస్సుల్లోకి చొచ్చుకొని పోయే విధంగా ఇన్నోవేటర్ల గురించి చెప్పిన ప్రోత్సాహ కథనాలు ఒకయెత్తు. ఆ గ్రామీణ ఇన్నోవేటరర్లు ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి, తాము అనుకున్నది సాధించిన తీరు తెలుసుకుంటూ మేము నడకలోని శ్రమను మరిచిపోయాము. సమాజానికి ఏదో చేయాలి అని స్ఫూర్తి కలిగించిన గణేశం గారు చెప్పిన కథలతో మా మనసు నిండిపోయింది.

యాత్ర ప్రారంభంలో నిర్మల్ లోని 'వాసవీ పాఠశాల'లో తోటి యాత్రికులను మొదటిసారి కలిసినపుడు వారు భిన్న వ్యక్తిత్వాలు, వేరువేరు వృత్తులు, ప్రదేశాల నుండి వచ్చిన వారైనా గ్రామాల గురించి తెలుసుకోవాలి, గ్రామస్తుల ను గౌరవించాలి, వారి జ్ఞానాన్ని నలుగురికీ పంచాలి అన్న ఏకైక ధ్యేయంతో వచ్చిన వారిగా తేలిపోయింది. అదే అందరినీ కలిపే మూలసూత్రం అయివుంటుంది. అందరూ ఏదో చేయాలి అన్న తాపత్రయం ఉన్నవారే.

ఈ మూడు రోజులు చిన్న శోధయాత్రలో పాల్గొన్న మా అనుభవ సారం ఏమిటి అంటే..... ఇక్కడ నా మనసులో నుండి వచ్చిన మాట చెపుతున్నాను. నేను భవిష్యత్తులో నాకు దొరికిన కాలాన్నంతా 'పల్లెసృజన' వాలంటీర్‌గా పని చేయాలని నిశ్చయించుకున్నాను.

చివరిగా భారతదేశ ఆర్థిక రంగానికి వెన్నెముకగా నిలిచిన పల్లెల గురించి మాకు చక్కటి అవగాహన కల్పించిన 'పల్లెసృజన'కి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను.

**యస్. శరత్ కుమార్ :** ఈ చిన్న శోధయాత్ర నాలో అంతర్మథనాన్ని లేపిందనే చెప్పగలను. నాలోని శక్తి యుక్తులను ప్రపంచం బాగు కోసం ఎలా వాడాలా అనే ఆలోచనను రేపింది. ఊహించలేని స్థాయిలో నా శారీరక, మానసిక శక్తులను పరీక్షించే అవకాశం కల్పించింది. నా చుట్టూ వున్న జ్ఞానాన్ని శోధించటం, గౌరవించటం ఎలాగో నేర్పింది. వ్యక్తుల గురించి, ప్రకృతి గురించి, గ్రామాల గురించి, కష్టపడే తత్వం గురించి మెచ్చుకోలు అంటే ఏమిటి అనే



**కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.**



విషయాలపై నాకున్న కొన్ని నమ్మకాలని పటాపంచలు చేసింది.

కష్టాలలో ఎలా నిస్పృహ చెందకుండా ద్విగుణీకృత ఉత్సాహంతో పని చేయాలో, పట్టుదలతో మన కలలని ఎలా సహకారం చేసుకోవాలి అన్న విషయాలు వివిధ రంగాల నుంచి వచ్చిన నా తోటి యాత్రీకుల వద్దనుండి తెలుసు కున్నాను. నిజం చెప్పాలంటే ఇంత తక్కువ కాలంలో ఇంత ఎక్కువ జ్ఞానాన్ని నేనెప్పుడూ పొందలేదు. భవిష్యత్తులో అవకాశం వస్తే తప్పకుండా శోధయాత్రలో పాల్గొనమని నాకు తెలిసిన వాళ్ళందరికీ చెప్తాను.

ఇన్నోవేటర్ల కథలు, వారి విజయ గాథలు, విఫలం చెందిన పరిస్థితులు, అనుకున్నది సాధించాలి అనే పట్టుదల లను గురించి తెలుసుకున్న నేను నా జీవితంలో కూడా కష్టపడి అనుకున్నది సాధించాలి అని నిర్ణయించు కున్నాను. నాకు అవకాశం దొరికినప్పుడల్లా 'పల్లెసృజన'కి ఇతోధికంగా నా సహాయం అందించాలని నిర్ణయించు కున్నాను. పల్లెసృజనను ప్రారంభించి శోధ యాత్రల ద్వారా యువత హృదయాలను ఉత్తేజంతో నింపుతున్న వారికి నా ధన్యవాదాలు. వీలైనంత త్వరలో పల్లెసృజన కార్యాలయానికి వెళ్ళి ఎన్నో విషయాలు వారితో చర్చించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. ●



## రైతుల సమస్యలకు పరిష్కారాలు కావాలి !

ఆగస్టు నెలలో ప్రసారమైన ఆకాశవాణి (ఎఫ్.ఎం.) 'ఫోన్ ఇన్' అనే కార్యక్రమంలో తెలుగు రైతులు వారి ఆలోచనలను, సమస్యలను, పరిష్కారాలను పంచుకున్నారు. కార్యక్రమం ఎంతో జ్ఞానదాయకంగా జరిగింది. వారు సూచించిన మూడు ముఖ్యమైన సమస్యలు ఈ క్రింద వివరించబడినవి.

**సమస్య 1 :** కందులను గ్రామంలోనే పప్పు చేసుకోగలగడం.

**సమస్య 2 :** పత్తిని చెట్టునుండి తీయటానికి సులభమైన మిషన్.

**సమస్య 3 :** నాట్లు వేసిన వరి పొలాల్లో కలుపు తీయటానికి తక్కువ ధరలో, తక్కువ బరువు గల వీడర్.

పై సమస్యలకు పరిష్కారాలు మీవద్ద ఉంటే మాతో పంచుకోగలరు. సమస్యను పరిష్కరించగల ఆలోచన మీవద్ద వుంటే, వాటి తయారీకి ఏదైనా సహాయ సహకారాలు అందించటానికి 'పల్లెసృజన' ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మీవద్ద వున్న పరిష్కారాల వివరాలను మాకు తెలియజేస్తే వాటిని రైతాంగానికి అందించటానికి ప్రయత్నిద్దాం.

**మీ సమస్యా పరిష్కారాలను తెలియజేయాల్సిన చిరునామా :**

'పల్లెసృజన' కార్యాలయం, 67,
రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
సెల్ : 9866001678/ 8125799904.

**విద్య 'నీడ' లాంటిది మన నుంచి ఎవ్వరూ వేరు చేయలేరు.**

## అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా

# మెదక్ జిల్లాలో 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన



జులై1, 2017న మెదక్ జిల్లా రామాయంపేట మండలం లోని 'కోనాపూర్' గ్రామంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సహకార శాఖ వారి ఆధ్వర్యంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన నిర్వహించడమైనది.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీమతి భారతీ హలికేరి, జిల్లా సహకార అధికారి వెంకట రెడ్డి, జిల్లా సహకార సంఘం ఛైర్మన్ దేవేందర్ రెడ్డి, పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం, సమన్వయ కర్త సుభాష్ చందర్‌లతో మరి కొంతమంది జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మన ఇన్నోవేటర్లు తయారు చేసిన ప్రతి ఇన్నోవేషన్‌ను అత్యంత ఆసక్తితో గమనించారు. ప్రతి ఇన్నోవేటర్‌ను వారి ఇన్నోవేషన్‌లను గురించి అడిగి వివరంగా తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని ఎంతోమంది రైతాంగం వీక్షించి, ఇన్నోవేటర్లతో వాటిపట్ల తమకున్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. మరి కొందరు రైతులు కొన్ని ఇన్నోవేషన్లను కొనుగోలు కూడా చేయటం జరిగింది. మరి కొన్నింటి కొనుగోలుకు ఆర్డరు కూడా

ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?

ఇవ్వడమైంది. ప్రతి ఇన్నోవేషన్ వెనక వున్న ఇన్నోవేటర్ సృజనాత్మకతను, పని చేసే విధానాన్ని రైతులకు, కలెక్టర్‌కు గణేశం గారు వివరించారు. రైతుల సమస్యలకు రైతులే చక్కటి పరిష్కారాలను అందించ గలరు అన్నారు.

ప్రాంగణమంతా రైతులు, విద్యార్థులు, గ్రామస్తులతో కళకళలాడింది. కార్యక్రమం ఎంతో విజయవంతం కావటంతో జిల్లా కలెక్టర్ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, గ్రామీణ స్థాయి సృజనాత్మకతను వెలుగులోకి తెస్తున్నందుకు 'పల్లెసృజన'ను అభినందించారు. రైతాంగం గ్రామీణులు తయారు చేసిన ఇన్నోవేషన్లను వినియోగించుకొని, లాభాలు పొందటమే కాకుండా, భారత ప్రభుత్వం చేస్తున్న 'మేకిన్ ఇండియా' కు తమ మద్దతు తెలిపిన వారవుతారని అన్నారు.

ప్రదర్శనలో పాల్గొన్న ఇన్నోవేటర్లు కూడా తమ ప్రదర్శనలను గ్రామీణులు ఎంతో ఆదరించినందుకు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రోత్సాహాలే మాకు నూతన ఆవిష్కరణల వైపు ఆకర్షితులయ్యేలా చేస్తాయన్నారు.






చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.

## స్పందన

గణేశం గారికి,

మీ గురించి మేము చాలాచోట్ల విన్నాం, మీరు చేస్తున్న సేవలు అనిర్వచనీయమైవి. 'పల్లెస్రృజన' పత్రికను నేను గత కొన్ని సంవత్సరాలుగా చదువుతున్నాను. ఆ పత్రిక నాకెంతో ఆనందాన్నిస్తుంది. మీరు ప్రజలకు చేస్తున్న సేవ ఒక ప్రత్యేకమైనది. మీ సేవా కార్యక్రమాలు నన్నెంతగానో ఆకర్షించాయి. ఒక ప్రభుత్వ అధికారులమైన మేము అందించలేని సేవలను మీరు అందిస్తున్నారు. మీ స్వచ్ఛంద కార్యకర్తలందరికి ధన్యవాదములు.

– **యుగంధర్,** ఓ.ఎస్.డి., కార్మిక శాఖ మంత్రి కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం.

యుగంధర్ గారికి,

మీ అభిమానానికి ధన్యవాదములు. మీలాంటి అధికారులు మమ్మల్ని ప్రోత్సహించడం మాకెంతో ఆనందంగా ఉంది. మీలాంటి వారి ప్రోత్సాహం వల్లనే 'పల్లెస్రృజన' యాత్ర నిర్విఘ్నంగా సాగుతూ 12వ సంవత్సరంలోకి అడుగు పెట్టకగలిగింది. భవిష్యత్తులో ప్రభుత్వం పల్లెజ్ఞానానికి వ్యవస్థలో సరియైన స్థానం కల్పిస్తుందని ఆశిస్తున్నాము.

**– బ్రిగేడియర్ పి. గణేశం.**


### HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management, Vastrapur, Ahmedabad - 380 015, Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org, http://www.sristi.org

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash,** Department of Agricultural Economics, University of Agricultural Economics, GKVK, Bangalore-560 065.E-mail : prakashtnk@yahoo.com

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8, Bhubaneswar-751 012. Orissa. E-mail . balaram_sahu@hotmail.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar, Virattipathu, Madurai - 625 010. Tamil Nadu, India.Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®, e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550, Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org, sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam), James T J,**
Peermade Development Society, Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State** |
| 2. Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. Printer's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | **102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State** |
| 4. Publisher's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | **102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State** |
| 5. Editor's Name | : | **J. Seshi Mohan** |
| Nationality | : | **Indian** |
| Address | : | **2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044.** |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : | **P. Ganesham** **102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State** |

**I, P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 28-02-2017

**Signature of Publisher**


**ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.**

## కరెంటు స్తంభాలను ఎక్కేందుకు చెప్పులు


ఇన్నోవేటర్ : **తిరుపతి రావు**



- కరెంటు స్తంభాలను ఎక్కటం చాలా సులభం.
- వాటిపైనే కూర్చుని స్తంభం పైన అవసరమైన పనులు చేసుకోవచ్చు.
- ఎక్కడికైనా తీసుకు వెళ్ళటం చాలా సులభం.
- బరువు 3 కిలోల లోపుగానే వుంటాయి.
- తేమ ఉన్నప్పుడైనా సరే స్తంభం ఎక్కవచ్చు.
- డెలివరీ సమయం : 3 రోజులు

## కొబ్బరి చెట్లను/గుండ్రటి స్తంభాలను ఎక్కే పరికరం

ఇన్నోవేటర్ : **తిరుపతి రావు**



- మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు కూడా సులభంగా ఉపయోగించుకోగల సాధనం.
- వర్షంలో తడిచిన చెట్లను కూడా ఎక్కవచ్చు.
- కొబ్బరికాయలు సేకరించే ఖర్చు చాలా తక్కువ.
- చెట్టుపైన వ్యక్తి రెండు చేతులతో పని చేసుకోవచ్చు.
- డెలివరీ సమయం : 7 రోజులు

## శ్రీతైలం

ఇన్నోవేటర్ : గల్లా చంద్రశేఖర్



- ప్రతిఇంట్లో ఉండాల్సిన పైపూత మందు.
- దీన్ని శరీరంపై పూసుకున్నచో దోమలు దరిచేరవు.
- ఎటువంటి గాయము, పుండు అయినా మధుమేహం వున్న వారికి సైతం అతి త్వరలో మానుతుంది.
- దీర్ఘకాలిక నొప్పులు, ఎటువంటి చర్మ రోగాలనైనా నివారిస్తుంది.
- కాలిన గాయాలు కూడా త్వరగా మాన్పడతాయి.
- చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామీణ శాస్త్రవేత్తలు తయారు చేసిన అద్భుతమైన పైపూత మందు.
- డెలివరీ సమయం - తక్షణం

## బోరు బావిలో నీటి ఊటను పెంచే పరికరం



ఇన్నోవేటర్ : గురుమూర్తి శెట్టి

- బోరు బావిలో పైపులకు చిన్న చిన్న రంధ్రాలు చేసే పరికరం.
- అలా చేయటం వల్ల పై పొరల్లో వున్న నీరు బోరు బావిలోకి వచ్చి నీటి సౌలభ్యత పెరుగుతుంది.
- ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు సులభంగా పని చేయవచ్చు.
- వందలాదిమంది రైతులు వినయోగించుకొన్నారు.
- డెలివరీ సమయం - 15 రోజులు


**కావలసిన వారు సంప్రదించండి : సుభాష్ చందర్, ఫోన్ : 040-27111959, 96528 01700**

PALLESRUJANA Telugu Bi-monthly July-August -2017 RNI No. APTEL 12136/01/01/2011-TC


# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**


























### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org
లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904